# నాయకుడు, నాయకత్వం

Disclaimer: We collected these images from Internet and RamaKrishna Prabha part of Social Awareness Campaign.

We are THANKFUL to the creators. We use these images for Non-Profit, Free Education purpose ONLY.

For more information on Awareness Campaign, please visit: www.freegurukul.org

యువవాహిని

# ప్రేరణాశక్తికి పంచ సూత్రాలు

| | | |
|---|---|---|
| O | 0 | Ohduq |
| H | 0 | Hyhu\|wklqj |
| D | 0 | Dqg |
| G | 0 | Gluhfw2# Glwuledwh |

ఇలా లీడ్ చేసేవాడే నిజమైన నాయకుడు. నాయకత్వం అనగానే అందరికీ ఆధిపత్యం గుర్తొస్తుంది. కానీ మార్గదర్శి కాని వాడు నాయకుడు కాలేడు. అంటే ముందు నడిచేవాడికి 'విజన్' ఉండాలి. అలాంటి దార్శనికతే మహాత్ముడిది. అందుకే ఉప్పుతో కూడా ఉద్యమం తెచ్చాడు గాంధీజీ. అలా తనపై నమ్మకం ఉండేలా నాయకుడు నడుచుకోవాలి. అంతమాత్రాన ఆధిపత్యం చలాయిస్తే ఏ అనుచరుడూ అంగీకరించడు.



ఇక్కడే సమూహనాయకుడికీ +Urxs Ohdghu, సంఘటితనాయకుడికీ +Whdp Ohdghu, తేడా. బహుళజాతి కంపెనీలు +PQFలు విరివిగా దేశంలోకి వచ్చాక ఉద్యోగనిర్వహణలో, నాయకత్వభావనలో ఎంతో తేడా వచ్చింది. ఈ రోజు ఏ కంపెనీలో చూసినా ఉన్నతాధికారులంతా యువకులే. అందుకే ఎంత త్వరగా నాయకత్వ లక్షణాలు అలవరచుకుంటే, అంత త్వరగా విజయానికి చేరువవుతారు. అందుకే ముఖ్యంగా ఈ యువ నేతలు గుర్తుంచుకోవాల్సిన అంశాలు:

| | | |
|---|---|---|
| *4. Sxqfwxdolw\|* | *0* | **సమయ నిబద్ధత** |
| *5. Glvflsolqh* | *0* | **క్రమశిక్షణ** |
| *6. Olwhqlq# Vnloov* | *0* | **వినదగునెవ్వరు చెప్పిన...** |
| *7. Dgdswdelolw\|* | *0* | **ఇమిడిపోయే తత్త్వం** |
| *8. Prwlydwlrq* | *0* | **ప్రేరణశక్తి** |

ఈ అయిదు అంశాలూ అంతర్లీనంగా అనుసంధానమయ్యే ఉంటాయి.

**1. సమయ నిబద్ధత:** అందరూ అనుకున్నట్లు సమయానికి రావటమే నిబద్ధత కాదు. అనుకున్న సమయంలో లక్ష్యం పూర్తి చేసుకొని రావడమే నిజమైన కాలనిబద్ధత. ఎప్పుడైతే ఇలాంటి నిబద్ధత మనకు అలవడుతుందో అది క్రమశిక్షణ వైపు మొగ్గు చూపుతుంది.

**2. క్రమశిక్షణ:** దార్శనికతతో లక్ష్యాలు ఏర్పరచుకొని, సమయ నిబద్ధత పాటిస్తూనే మనం అవలంబించే పద్ధతి క్రమశిక్షణ. ప్రతి సంస్థకూ ఒక పరిధి, విధివిధానాలు ఉంటాయి. వాటికి అనుగుణంగా మనం నడుచుకోవడమే క్రమశిక్షణ. ఈ లక్షణం ఎంత త్వరగా అలవడితే అంత ముందుకు పోగలం. అయితే ఈ ప్రయాణంలో మనం అవతలవాళ్ళు చెప్పేది వినే సహనం కూడా పెంచుకోవాలి.

**3. వినదగునెవ్వరు చెప్పిన** *+Olwhqlq#Vnloov;* విప్రో ప్రేమ్‌జీని ఒకసారి వేదికపైకి వచ్చి స్ఫూర్తిదాయకమైన నాలుగు మాటలు చెప్పమని ఆహ్వానించారట. ఆయన ఒక్క క్షణం వేదికపైకి వచ్చి మైకులో "నాకు చెప్పడం కన్నా వినడమే ఇష్టం" అనగానే హాలు చప్పట్లతో మారుమోగిపోయింది. కాబట్టి ఎక్కువ వినేవాడు విజయం సాధిస్తాడు. వేగంగా లక్ష్యాలు చేరుకునే నాయకుడికి వినే శక్తి ఎక్కువ ఉండాలి.

**4. ఇమిడిపోవడం** *+Dgdswdelolw\|;* సమయనిబద్ధత, క్రమశిక్షణ, మంచి శ్రోతగా ఉండడం - ఇవన్నీ విజయం వైపు పయనించేలా చేస్తాయి.

అయితే వీటన్నింటి తరువాత చివరిది, ముఖ్యమైనది సంస్థలో ఇమిడిపోవడం. మనలో చాలామందికి ఇది కష్టంగా ఉంటుంది. అది మన అస్తిత్వాని +Lghqwlw\|, కి ప్రమాదమనుకుంటాం. అదే పొరపాటు. ఎంత పెద్ద యంత్రంలో బోల్టు చిన్నదైె ఇమిడిపోయినా దాని ప్రాధాన్యం దానిదే. కాబట్టి సంస్థ విధివిధానాల్లో మనమూ ఒకరిగా, దాని ప్రగతిలో చేయి కలిపితేనే నిజమైన నాయకులం అనిపించుకుంటాం.

> ***నా**యకుడిగా ఎదగాలనుకునేవాడు ముందు మంచి సేవకుడై ఉండాలి. అవసరమైన త్యాగానికి సిద్ధపడకుండానే మనలో చాలామంది నాయకులమవ్వాలని కాంక్షిస్తాం. అందుకే సేనాని ఎప్పుడూ సైన్యానికి ఆదర్శంగా ఉండాలి. సైన్యంలో ప్రతి ఒక్కరినీ సేనానిగా తీర్చిదిద్దగలిగే దార్శనికతను పెంచుకోవాలి.*
>
> **- స్వామి వివేకానంద**

**5. ప్రేరణశక్తి** (*Prwlydwlrq*): పై నాలుగు అంశాల్ని సమర్థంగా ఆచరించిన నాయకుడికి ఈ ప్రేరణశక్తి దానంతట అదే వస్తుంది. లక్ష్యానికి చేరుకోగానే అనుచరులు ముందు నాయకుడి నుంచి పొందేది ఈ శక్తే. అలాంటి ప్రేరణశక్తి అందివ్వగలిగిన నాడు, తన అనుచరులు కూడా భవిష్యత్తులో నాయకులుగా ఎదగగలుగుతారు. అందుకే తన బంటును కూడా భగవంతుణ్ణి చేసి శ్రీరాముడు ఈ జగత్తుకే నిజమైన నాయకుడయ్యాడు. ##

**- హర్షవర్ధన్**




"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★



# నాటికీ నేటికీ

'మన భారతదేశ యువతరానికి స్వామి వివేకానందుల రచనలు, ఉపన్యాసాలు అత్యంత స్ఫూర్తినీ, ప్రేరణనూ ఇచ్చి వారిలో దేశభక్తినీ, ఆత్మశక్తినీ జాగృతం చేసి ముందుకు నడిపిస్తాయని భావించి స్వామీజీ జన్మదినమైన – జనవరి 12ను 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటిస్తున్నాం' అని 1985వ సంవత్సరంలో ఆనాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వివరించారు. కానీ చాలా మంది యువతకు ఈ విషయం తెలియదు! రామకృష్ణ మిషన్, మరికొన్ని ఇతర సంస్థలు తప్ప, జాతీయ యువజన దినోత్సవాన్ని ఎవరూ జరుపుకోవడం లేదు! ఇది ఎంతో శోచనీయం!

ఎందుకు స్వామి వివేకానంద యువతకు ఆదర్శం? కేవలం ముప్పై తొమ్మిదిన్నర సంవత్సరాల యువకునిగానే స్వామీజీ 39 యుగాలేమిటి, సూర్య చంద్రులుండేటంత వరకూ మానవాళికి మేలు చేసే జ్ఞానసంపదనూ, ప్రేరణాశక్తినీ ప్రసాదించి వెళ్ళారు! 30 ఏళ్ళ వయస్సులో 1893 సెప్టెంబరు 11వ తేదీన అమెరికా లోని చికాగో మహానగరంలో 'విశ్వమత మహాసభ'లో ఏడు వేల మంది శ్రేష్ఠ మేధావులు, ఆచార్యులు, మత పెద్దల ముందు 'Sisters and Brothers of America - అమెరికా సోదరీ సోదరులారా!' అనే సంబోధనతోనే విశ్వమానవ హృదయాంత రంగాలను పులకాంకితులను చేసిన ఘనత వివేకానందులది. అలా వివేకానంద విజయ యాత్ర, జ్ఞానదాన జైత్రయాత్ర 1902 జూలై 4న బేలూరు మఠంలో సాధువులు, బ్రహ్మచారులకు ఉపనిషత్తులలోని ఆత్మజ్ఞాన తత్త్వాలను వివరించే వరకూ కొన సాగింది. కేవలం 9 ఏళ్ళ లోనే 1,500 సంవత్సరాలకు కావలసి నంత సందేశాన్ని ప్రసాదించి వెళ్ళిన నవ యువ వేదాంత కేసరి, భారత ఆధ్యాత్మ సింహం, హైందవ ఝంఝామారుతం స్వామి వివేకానంద. మన యువతకు ఆయన ఆదర్శవంతుడు కాదా?

గురుదేవులయిన శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం స్వామీజీ 1890లో పరివ్రాజక సన్న్యాసిగా భారతదేశ పాదయాత్ర ప్రారంభించారు. భారతీయ నిరుపేదల కష్టాలనూ, కన్నీళ్ళనూ ప్రత్యక్షంగా దర్శించారు. రాజుల, మహారాజుల, సంపన్నుల భోగాలను, కరడు గట్టిన స్వార్థపరుల జీవితాలనూ వీక్షించారు. అంటరానితనం, అజ్ఞానం, విదేశీ పాలకులకు దాసత్వం, ఆకలి, నిరక్షరాస్యతల విలయ తాండవం ప్రత్యక్షంగా చూసి విలవిలలాడారు. భారతదేశ ఆఖరి దక్షిణాగ్రం కన్యాకుమారికి చేరుకుని అమ్మవారి దర్శనం పొంది సముద్రమధ్యంలోని 'శ్రీపాదశిల'పై మూడు రోజులు 'భారతదేశం'పై ధ్యానించారు. ఇలా ఒక యువ సన్న్యాసి స్వీయమోక్షం, ఇష్టదైవ దర్శనం కోసం కాక తన మాతృదేశ పురోగతి కోసం, ఉజ్జ్వల భవిష్యత్తు కోసం ధ్యానం చేయడం ప్రపంచ చరిత్రలో మరెక్కడా, ఎన్నడూ జరుగలేదు! స్వార్థ ప్రయోజనాల కోసం, తుచ్ఛ సుఖభోగాల కోసం మాతృదేశ ప్రజాధనాన్ని 'స్వాహా' చేస్తున్న ఈ రోజుల్లో భారతీయుల కష్టాలను చూసి కలత చెందిన ఈ యువ సన్న్యాసి భారత యువతకు ఆదర్శవంతుడు కాదా?

'...your country needs Heroes; Be Heroes ' అని ఓ లేఖలో తమ శిష్యులకు అమెరికా నుండి వ్రాశారు స్వామీజీ. శ్రీరామకృష్ణుల ఆదేశం, శ్రీశారదామాత ఆశీస్సులతో అమెరికాలోని చికాగో నగరంలో జరుగబోయే 'విశ్వమత మహాసభ'లకు 1893, మే 31న ప్రయాణమయ్యారు స్వామీజీ. నెలల తరబడి సముద్ర ప్రయాణం. జూలైలో చికాగో చేరుకున్నాక తెలిసింది – మహాసభలు సెప్టెంబరులో ప్రారంభమవుతాయని. చేతిలో ఉన్న ధనం అంతంత మాత్రమే! ఎవరూ పరిచయం లేరు... ఈ కొత్త వింత కాషాయరంగు దుస్తుల మనిషిని విచిత్రంగా చూస్తూన్న అమెరికన్లు... తలపాగా లాగారు కొందరు, వెకిలిగా నవ్వారు కొందరు, రాళ్ళు రువ్వారు తుంటరి పిల్లలు. తల దాచుకోవడానికి ఒక ఇల్లు లేదు. ఆకలితో ఎన్నోసార్లు



భిక్షమడగడానికి ప్రయత్నించారు. ముఖం మీదే వాకిళ్ళు దభేలుమని మూసేశారు. నల్లజాతివాడు అని అవమానించి రాత్రులు తలదాచుకోవడానికి లాడ్జీలలో గది ఇవ్వలేదు! ఆకలి, అలసటతో సొమ్మసిల్లి ఫుట్‌పాత్ మీద పడిపోయారు ఓ రోజు! రైలు గూడ్సు పెట్టెలో చలికి వణుకుతూ రాత్రికి తల దాచుకున్నారు మరో రోజు!

ఇలా ఎన్ని కష్టాలు, కడగండ్లు, అవమానాలు, అవహేళనలు ఎదురైనా వివేకానందుని ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, ప్రచండ

# నిజనాయకుడే!

– స్వామి అర్చనానంద

సంకల్పం చెక్కుచెదరలేదు! మొక్కవోని ధైర్యసాహసాలతో, దైవంపై అచంచల విశ్వాసం, శరణాగతితో ఈ యువ సన్న్యాసి అడుగు ముందుకే వేశాడు కానీ వెనుకంజ వేయలేదు, వెనుతిరిగి చూడలేదు!

చిన్న మాటలకే అలిగే యువతీ యువకులు; తల్లితండ్రులు అడిగింది ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకొనే విద్యార్థులు; పరీక్షల్లో తప్పితే మరణమే శరణ్యమనుకునే దుర్బల మనస్కులు; తండ్రి క్రమశిక్షణను బోధిస్తే ఇల్లు విడిచి పారిపోయే విద్యార్థులు – ఈ బలహీన మనస్కులు, దుర్బల హృదయులకు **'బలమే జీవనం. బలహీనతే మరణం... ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగు'. ఆత్మవిశ్వాసమున్న కొద్దిమంది ధీరుల చరిత్రే ప్రపంచ చరిత్ర** – ఇలాంటి అగ్ని మంత్రాలు, ధీరవచనాలతో ప్రేరణనూ, స్ఫూర్తినీ ఒసగే వివేకానంద స్వామి యువతరానికి ఆదర్శవంతుడు కాదా?

ఈ రోజు యువతీ యువకులలో, విద్యార్థులలో ఒక దౌర్బల్యం ప్రవేశించింది. అది సినిమా హీరో, హీరోయిన్లనూ, ఫ్యాషన్ స్టార్లనూ 'రోల్ మోడల్'గా చేసుకొని, వారిని గుడ్డిగా అనుకరించడం, అనుసరించడం! నేటి యువతీయువకులు, అలా తయారుకావడానికి బాధ్యతా రహితులైన తల్లితండ్రులూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. నటనను వృత్తిగా స్వీకరించిన వారు నటులు మాత్రమే! నటులుగా వారి స్థానాన్నీ, గౌరవాన్నీ వారికి ఇవ్వాలి. అంతేకానీ ఆ నటుల్ని అనుకరిస్తూ జీవితాలను పాడు చేసుకోకూడదు.


సమాజంలో డాక్టర్‌కూ, ఇంజనీర్‌కూ, లాయర్‌కూ, ప్రొఫెసర్‌కూ ఎలా ఒక స్థానం ఉందో అదే స్థానం ఒక యాక్టర్‌కూ ఉండాలి! కానీ ఆ నటులను అనుకరించే మోహం నుండి మన యువతరం ఎంత త్వరగా బయట పడితే మన దేశానికి అంత మంచిది!

ఒక మోహన్‌దాస్ కరమ్ చంద్‌లో వెయ్యింతలు దేశభక్తిని పెంచి, 'మహాత్మా గాంధీ'గా మలచిన వివేకానందే మన యువతకు ఆదర్శం.

సుభాష్ చంద్ర బోస్‌లో ధైర్యసాహసాల్నీ, దేశభక్తినీ నూరిపోసి 30 వేల మందితో యువ 'ఆజాద్ హిందు ఫౌజ్'ను స్వాతంత్ర్యసమరం కోసం నడిపింపజేసి 'నేతాజీ'గా చేసిన వివేకానందస్వామే మన యువకులకు 'కమాండర్ ఇన్ చీఫ్'.

జెమ్‌షెడ్‌జీ టాటా గుండెల్లో ఆత్మశక్తి తూటాలను పేల్చి 'నవభారత పారిశ్రామికనేత'గా తీర్చిదిద్దిన వివేకానందుడే మన దేశానికి ఆదర్శనేత.

ఆత్మహత్యకు పూనుకున్న అన్నా హజారేకు ఆదర్శ సమాజ సేవకునిగా మారడానికి ప్రేరణనిచ్చిన మహోన్నత దేశప్రేమి స్వామీజీయే దేశానికి నిజమైన ఆదర్శప్రాయుడు.



కాలు లేని అమ్మాయి 'అరుణిమా సిన్హా' ఎవరెస్ట్ పర్వతం అధిరోహించేందుకు ఆత్మబలం, సాహస స్ఫూర్తీ ప్రసాదించిన వివేకానందుడే మన జాతికి నిజమైన ఆదర్శవంతుడు.

కొండలు, గుహలు, అరణ్యాలు, హిమాలయాలకే పరిమితమైన సన్న్యాసులు, యతులకు 'మానవ సేవే మాధవ సేవ' అన్న మహామంత్రంతో 'నిరుపేదల సేవలోనే నిర్వాణ సుఖం' ఉందని నిరూపించిన వివేకానందుడే నిజమైన ఆదర్శవంతుడు.

కాబట్టి, నేటి యువతరం నిజ జీవితంలో నిజమైన వీరులూ, శూరులూ, ధీరులూ కావాలంటే జ్ఞానతేజం, శక్తిపుంజం, స్ఫూర్తికేంద్రమైన – స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి! ❖

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.


www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

# నిజమైన నాయకుడు ఎలా ఉండాలి?

- డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్



నిజమైన నాయకుడు ఎలా ఉండాలి? ఈ ప్రశ్నకు భారత మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ తన స్వీయ అనుభవంతో ఇలా జవాబిచ్చారు:

“నా (కలామ్) స్వీయ అనుభవం ఒకటి చెబుతాను. ఎస్.ఎల్.వి-3 (భారత శాటిలైట్ లాంచింగ్ వెహికల్ ప్రోగ్రామ్)కి 1973లో నేను ప్రాజెక్ట డైరెక్టర్‌ని అయ్యాను. 1980 లోపల ‘రోహిణి’ అనే ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టడం మా లక్ష్యం. నాకు సమృద్ధిగా ధనం, మానవ వనరులు ఇచ్చారు. అయితే 1980 లోగా ఉపగ్రహాన్ని రోదసిలో ప్రవేశపెట్టాలి అని స్పష్టంగా చెప్పారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలోని వేల మంది నిపుణులు కలసి పరిశ్రమించారు.

ఆగష్టు 1979 కల్లా మేము తయారుగా ఉన్నామనుకున్నాం. ప్రాజెక్ట డైరెక్టర్‌గా ప్రయోగానికి కంట్రోల్ సెంటర్‌కి వెళ్ళాను. ఉపగ్రహ ప్రయోగానికి 4 నిమిషాల ముందు కంప్యూటర్ అత్యవసర సామగ్రిని జాబితా ప్రకారం సరిచూడడం ప్రారంభించింది. ఒక నిముషం తరువాత గమన దశ మొదలైన వాటిని నిర్దేశించే యంత్రభాగాలు కొన్ని సరిగ్గా లేవనీ, ప్రయోగాన్ని నిలిపివేయమనీ సందేశం వచ్చింది. నా వెంట ఉన్న నలుగురైదుగురు నిపుణులు మరేం భయపడనవసరం లేదనీ, తమ లెక్క ప్రకారం అంతా సరిగ్గానే ఉందనీ, తగినంత ఇంధనం కూడా ఉందనీ అన్నారు. అందువల్ల నేను కంప్యూటర్ సందేశాన్ని పట్టించుకోకుండా, ఉపగ్రహం ఉన్న రాకెట్‌ను ప్రయోగించాను. మొదటి దశలో అంతా బాగానే ఉంది. రెండో దశలో చిన్న సమస్య మొదలైంది. ఉపగ్రహం కక్ష్యలోకి ప్రవేశించడానికి బదులు, రాకెట్ మొత్తం బంగాళాఖాతంలో మునిగిపోయింది. ఆ విధంగా ఓటమి ఎదురైంది.



ఆచార్య సతీష్ ధవన్

అదే రోజున భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అధ్యక్షుడు ఆచార్య సతీష్ ధవన్ పాత్రికేయులతో శ్రీహరికోటలో సమావేశం జరిపారు. సంస్థ అధ్యక్షులు ఆచార్య ధవన్ స్వయంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఎదురైన అపజయానికి పూర్తి బాధ్యతను తానే వహించారు. ‘తమ బృందం ఎంతో పరిశ్రమించిందనీ, అయితే సాంకేతికపరమైన సహకారం ఇంకా అధికంగా అవసరమనీ అంటూ, మరొక ఏడాది లోపే తమ బృందం విజయాన్ని సాధిస్తుందని పూర్తి విశ్వాసంతో చెప్పారు’. నిజానికి, ఇక్కడ ప్రాజెక్ట డైరెక్టర్‌ని నేను. ఆ ఓటమి నాది! అయినప్పటికీ సంస్థ అధ్యక్షునిగా అపజయానికి తానే బాధ్యుణ్ణి అని ఆచార్య సతీష్ ధవన్ అన్నారు.

తరువాతి సంవత్సరం, అంటే 1980 జూలైలో ఉపగ్రహాన్ని ప్రయోగించే ప్రయత్నం చేశాం. ఈ ప్రయత్నం సఫలమైంది. దేశం మొత్తం హర్షించింది. అప్పుడు కూడా పాత్రికేయుల సమావేశం జరిగింది. ఆచార్య ధవన్ నన్ను పక్కకు పిలిచి, “ఇవాళ సమావేశాన్ని నువ్వు నిర్వహించు” అన్నారు. ఈ విజయం తనది కాదనీ, తమ బృందానిది అనీ ప్రకటించారు.

ఆ రోజు ఒక ముఖ్యమైన విషయం తెలిసింది నాకు. **అపజయం ఎదురైనప్పుడు సంస్థ నాయకుడు ఆ అపజయానికి బాధ్యుణ్ణి తాను అన్నారు! విజయం లభించినప్పుడు ఆయన దానికి కారణం బృందానిది అన్నారు.**

కార్యనిర్వహణకు కావాల్సిన అతి ముఖ్యమైన పాఠం అది. దీన్ని నేను ఏ పుస్తకమూ చదివి నేర్చుకోలేదు, అనుభవం వల్ల నేర్చుకున్నాను.”

Free Soft Copy Ramakrishna Math Hyderabad www.rkmath.org



“ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్” ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

యువవాహిని

# విజయవంతంగా జీవించడం ఎలా?

- స్వామి జగదాత్మానంద

(గత సంచిక తరువాయి)

భారత జీవిత బీమా సంస్థలో పనిచేసిన ఒక ఉన్నతాధికారి తాను సేవ చేసిన కాలంలో తన క్రింది ఉద్యోగులను ప్రేమ విశ్వాసాలతో ఎలా నియంత్రించగలిగాడో వివరించాడు:

"అన్ని కార్యాలయాలలో లాగా ఇక్కడ కూడా మూడు రకాల ఉద్యోగులు ఉండేవారు. వారిలో ఇద్దరో, ముగ్గురో చాలా సమర్థులు, మంచివారు, విధేయులు. ఒకరిద్దరు క్రమశిక్షణ లేకుండా, అల్లరిగా, సోమరితనంతో, వినాశకరమైన మనస్తత్వం కలిగి ఉండేవారు. ఈ మిగిలిన వాళ్ళు ఈ రెండు రకాల వారికీ మధ్యరకం. వారిది అటూ ఇటూ ఊగిసలాడే స్వభావం. ఈ ఊగిసలాడే స్వభావం గల ఉద్యోగులు చెయ్యదలుచుకుంటే చక్కగా పనిచెయ్యగలరు. అందరితో ఒకే విధంగా ప్రవర్తించడం సాధ్యం కాదు. ఒక్కొక్కరికీ ఒక్కొక్క విధమైన స్వభావం ఉంటుంది. ప్రతీ ఉద్యోగి గురించీ బాగా తెలిస్తేగానీ అతడి ప్రవర్తన అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఇంటి సమస్యలు, ఇంతకు ముందున్న అధికారితో తగాదాలు, తాను కోరుకున్న చోటికి బదిలీ కాకపోవడం వల్ల కలిగే నిస్పృహ, నాయకుడు కావాలన్న కోరిక, స్వతహాగా ఉన్న సోమరితనం, ఎదుటి వారికి చీకాకు కలిగించే స్వభావం మొదలైనవి వారి అసంతృప్తికీ, క్రమశిక్షణా రాహిత్యానికీ కొన్ని కారణాలు కావచ్చు. ఈ సమస్యలకు పరిష్కారం చూపడం నా వల్ల అయ్యే పని కాదు. నేను చెయ్యగలిగింది వీటివల్ల కలిగే చెడుప్రభావాన్ని వీలైనంత తగ్గించి, పని మరింత సమర్థంగా జరిగేలా చూడడమే".



"వారిలో నిజాయతీగా పనిచేసే వారి విషయంలో నేను చెయ్యవలసినదేమీ లేదు. వారు చేసే పని సక్రమంగా ఉందని,అప్పుడప్పుడు నేను వారి పట్ల ప్రేమ, గౌరవం, నమ్మకం వ్యక్తం చేసేవాణ్ణి. అయితే ఇది ప్రకటితమవకుండా నేను జాగ్రత్త పడేవాణ్ణి. ఒక కార్యాలయంలోని వాతావరణం ఎప్పుడూ చాలా సున్నితంగా ఉంటుంది. బాధ్యతగా పనిచేసే ఉద్యోగిని పొగిడితే, మిగిలినవారు అసూయ పెంచుకుని, పనిచెయ్యడం మానివేసి, సోమరిపోతులుగా తయారయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల నేను చాలా జాగ్రత్తగా వ్యవహరించేవాణ్ణి. చాలాసార్లు అందరిలో కాకుండా కేవలం మేమే ఉన్నప్పుడు వాళ్ళను మెచ్చుకునేవాణ్ణి. నా మెప్పు సహజమైనదని చూపడానికి తగినంత బుజువును కూడా చూపేవాణ్ణి".

"ఇక రెండో రకపు ఉద్యోగులు ఎటువంటి వ్యూహానికీ లొంగేరకం కాదు. వాళ్ళు ఉన్నతాధికారులందరూ తమకు శత్రువులేనన్న అపోహను పెంచుకున్న కార్మిక సంఘ నాయకులు. వాళ్ళు తెలివైనవాళ్ళు, అర్థం చేసుకోగలిగిన

# నడిపించేవాడే



మనస్తత్వం గలవారు. అయినా, అప్పటి వరకూ సంస్థలో తాము సాధించిన "పేరు"కు వారు అమ్ముడుపోయినవారు. వాళ్ళకు ఆ పేరు పోగొట్టుకోవడం ఇష్టం ఉండదు. కొన్నిసార్లు వాళ్ళకు పనిచెయ్యాలనే ఉన్నా, ముందు నుంచీ ప్రతికూలస్వభావులుగా పేరుపడ్డారు కాబట్టి దాన్ని పోగొట్టుకోకుండా ఉండడం కోసం తమ మంచితనాన్ని కప్పిపెట్టడానికి ప్రయత్నిస్తూ ఉంటారని నేను కనిపెట్టాను. కార్మిక సంఘనాయకుల సమస్య నాకు తెలుసు కనుక నేను వారిని మానవతా దృష్టితోనూ, దయతోనూ, సహృదయంతోనూ, స్నేహభావంతోనూ చూసేవాణ్ణి. ఇది నాకు స్వాభావికం. ప్రతి వ్యక్తికీ తనదైన ఒక శక్తి, కొన్ని హద్దులు (పరిమితులు) ఉంటాయి. ఇదే అన్నిటికన్నా ముఖ్యమైంది. ప్రతివాడూ తన స్వభావానికి తగినట్లుగా తన జీవితవిధానానికి ఒక మార్గాన్ని నిర్దేశించుకోవాలి. ఇతరుల పద్ధతులను అనుకరించకూడదు. నిజాయతీ, కరుణ నా పద్ధతులు. దీనివల్ల ఫలితాలను సాధించడానికి కొంత సమయం పట్టవచ్చు, కానీ అవి శాశ్వతమైనవి. నా దగ్గర



ఎలాంటి యుక్తులూ లేవు. తాత్కాలికమైన అద్భుతాలను నేను నమ్మను. కొద్దిగంటలపాటు కొందరిని మోసం చేసి పనిచేయించుకోవడం నాకు నచ్చదు. నా క్రింది ఉద్యోగులు నాతో కలిసి కనీసం మూడు, నాలుగు సంవత్సరాలు పనిచేస్తారు. ఇదొక దీర్ఘకాలిక సంబంధం. సమస్యలకు నాదైన రీతిలో పరిష్కారాన్ని కనుక్కోవలసి వచ్చేది. మా సంస్థలో ఉన్నతాధికారులకు చాలా అధికారాలు ఉన్నాయి. కానీ అవన్నీ కాగితాల వరకే పరిమితం. వాటిని ఉద్యోగుల మీద ఉపయోగించడం అసాధ్యం. ఈ అధికారాలను వినియో


# నిజమైన నాయకుడు



గించడం సంఘాలతో విరోధం తెచ్చుకోవడమే అవుతుంది. చట్టపరమైన పద్ధతులను వాడడం ద్వారా సరైన పరిష్కారాలు లభించవని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

ఈ కారణాల వల్ల నిజాయతీ, నిష్పాక్షపాతం, సత్ప్రవర్తనతో సమస్యలను పరిష్కరించడం సరైన పద్ధతిగా నాకు తోచింది."

"మొదట కొద్దినెలల్లో నేను వాళ్ళను మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నానేమోనని నా క్రింది ఉద్యోగులకు అనుమానం, సందేహం ఉండేవి. మనసును నొప్పించేలా ఉన్నవారి ప్రవర్తనను నేను ఓర్పుతో భరించాను. చెప్పక తప్పని పరిస్థితిలో నేను సరైన రీతిలో వారికి సమాధానమిచ్చేవాణ్ణి. నేనే చూడక ఏదైనా పొరపాటుచేస్తే వెంటనే నిజాయతీతో నా తప్పు ఒప్పుకుని దాన్ని సరిచేసుకునేవాణ్ణి. నా పని మీద ఏకాగ్రత చూపాను. అప్పట్లో రోజూ ఉదయం 9.30 నుండి రాత్రి 9.00 గంటలవరకూ పనిచేసేవాణ్ణి. నిజానికి చెయ్యవలసిన పని చాలానే ఉండేది. పైగా నా క్రింది ఉద్యోగులకు నా పట్ల నమ్మకం కలగాలి. క్రమంగా నేను తగినంత అనుభవం, జ్ఞానం సంపాదించాను. మంచి ఆత్మవిశ్వాసం, నైతిక స్థైర్యం అలవడ్డాయి. నేను ఇతరులకన్నా ఎక్కువసేపు ఆఫీసులో ఉండి ఎక్కువ పని చెయ్యడం వల్ల ఒక రకమైన ఆధిక్యాన్ని సంపాదించాను. ఇతరులను పనిచేయాలని చెప్పగలిగే నైతికబలం నాకు వచ్చింది. గొప్ప ఓరిమి కూడా అలవడింది. విసుగునూ, కోపాన్నీ జయించడం నాకు గొప్ప సవాలుగా నిలిచింది. ఉద్రేకాలకు లోనైతే ఏ చిన్న సమస్య అయినా ఎంత తీవ్రమవుతుందో నేను అనుభవం మీద తెలుసుకున్నాను. ఆ తర్వాత నేను నిరంతరం అభ్యాసం చేసి ఆత్మనిగ్రహం అలవరచుకోవాలని నిర్ణయించుకున్నాను. ఇది ఆరంభంలో చాలా మానసిక ఒత్తిడిని కలిగించింది. కానీ అదుపు లేకుండా మాట్లాడడం వల్ల పనులు ఎలా చెడిపోతాయో చక్కగా తెలుసుకుని, క్రమంగా నేను ఆత్మనిగ్రహాన్ని అలవరచుకున్నాను."



"బీమా వ్యాపారానికి బీమా ఏజంట్లను వెన్నెముకగా అభివర్ణిస్తారు. కొందరు ఏజంట్లు కలహ ప్రియులుగా ఉంటారు. తమ పనులు వెంటనే జరగాలని కోరతారు. అలా కాకపోతే వాళ్ళు అరుపులూ, కేకలకు దిగడమేకాక పై అధికారులకు ఆకాశరామన్న ఉత్తరాలు కూడా వ్రాస్తారు. ఒకసారి అలాంటి ఏజంటు ఒకడు అంగీకారయోగ్యం కాని ఏదో ఒక అదనపు సౌకర్యం కావాలని కోరాడు. సంబంధిత అధికారి అందుకు అనుమతించలేదు. దానితో ఆ ఏజంటు కోపం పట్టలేక "మీ ఏజంట్లు మీ సంస్థకు వెన్నెముక అని ఎందుకు అంటారు?" అంటూ అరిచాడు. నా క్రింది ఉద్యోగుల్ని రక్షించే బాధ్యత నాది కనుక, ఆ ఏజంట్‌తో, "వెన్నెముక వెనుక ఉండాలి కానీ ముందు ఉండకూడదు!" అన్నాను. ఆ మాటతో కార్యాలయం నవ్వులతో నిండిపోయింది. ఆ ఏజంట్ అవమానంతో వెళ్ళిపోయాడు. నా క్రింది ఉద్యోగులు సంతోషించారు. కానీ తర్వాత ఆ ఏజంట్ నా ఉన్నతాధికారులకు నా మీద ఫిర్యాదు చేశాడని తెలిసింది. కానీ వారికి నా నిజాయతీ గురించి తెలుసు కనుక వాళ్ళు నన్ను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆ ఫిర్యాదును పట్టించుకోలేదు. ఇటువంటి సంఘటనలు చాలా జరిగాయి."

ప్రేమకు జాతి, కుల, మతాలు ఉండవు. పవిత్రప్రేమ క్రిందివారి హృదయాలను గెలుచుకోగలదు. ఇదే ప్రేమలోని ఇంద్రజాలం! e

(సశేషం)

అనువాదం: అమిరపు నటరాజన్

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.
www.freegurukul.org
Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org
★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★



# నాయకుడికి నియమావళి...

– స్వామి సమర్పణానంద

మహాభారత యుద్ధానంతరం ధర్మరాజు మహారాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు. హస్తినాపురం రాజధానిగా పాండ వాగ్రజుడు పాలన ప్రారంభించే ముందు వివిధ సందర్భాల్లో నారదుడు, భీష్మాచార్యులు, ఆస్థాన పండితుడు ధౌమ్యుడు రాజుగా నాయకుడికి ఉండాల్సిన ముఖ్య లక్షణాలను స్పష్టం చేశారు. సర్వకాలాలకు సమన్వయించుకోగలిగిన సూచనలవి!

ఆధునిక పాలకులకూ, కార్యాలయ నిర్వహణా దక్షతకూ ఆ సూచనలు శిరోధార్యాలంటే అతిశయోక్తి కాదు. వాటిని విధిగా పాటిస్తే విజయవంతమైన నాయకుడని అనిపించు కోవచ్చు!

**1. ఈ దుర్గుణాలకు దూరం :** నాయకుడైన వ్యక్తి ముందు నిబద్ధతతో మెలగాలి; ఆగ్రహాన్నీ, అశ్రద్ధనూ, పనిని వాయిదా వేసే లక్షణాన్నీ, నిరాసక్తతనూ, నిరాశావాదాన్నీ, అసహనాన్నీ, ఏకపక్ష నిర్ణయాలనూ, ప్రణాళిక నుంచి పక్కకు తప్పుకునే గుణాన్నీ పక్కన పెట్టాలి. ఎంతటి స్థానంలో ఉన్న నాయకుడి నైనా సరే ఈ దుర్గుణాలు పతనావస్థకు చేరుస్తాయి. అదే విధంగా విజ్ఞులు చెప్పే సూచనలను విచక్షణతో పరిగణనలోకి తీసుకోవాలి.

**2. సచ్ఛీలమే శోభాయమానం :** అధికారిగా నలుగురికీ మార్గదర్శకత్వం చేసే వ్యక్తి ముందు తాను సత్ప్రవర్తనతో మెలగాలి. ఆత్మనిగ్రహం, నమ్రత, పవిత్రత, ఋజువర్తన, ధర్మనిరతి అలవరచుకోవాలి. ఉద్రేక, ఉద్వేగాలను అదుపులో పెట్టుకుంటూ సామరస్యంగా నడుచుకోవాలి. బలహీనతలను బయల్పరచకూడదు. ముఖ్యంగా ప్రతి విషయాన్నీ సంశయాత్మక దృష్టితో చూడకూడదు.

**3. 'అతి'తో అనర్థం :** కింద పనిచేసే వారి విషయంలో నాయకుడు 'అతి'గా ప్రవర్తించకూడదు. మెతకగా ఉన్నా ప్రమాదమే; కర్ర పెత్తనం చేసినా అనర్థమే! సౌమ్యంగా ఉండడం వేరు; ఉదాసీనంగా ఉండడం వేరు; దృఢంగా ఉండడం వేరు; కఠినంగా వ్యవహరించడం వేరు. ఆదేశించే వ్యక్తి సౌమ్యంగా, దృఢంగా ఉండాలి. ఎంతటి తప్పునైనా క్షమించేస్తూ ఉంటే అనుయాయులు దానిని అలుసుగా తీసుకొని నాయకుడిపైనే స్వారీ చేస్తారు. అలాగని ప్రతి చిన్న పొరపాటుకూ కర్కశంగా వ్యవహరిస్తే రాక్షసుడని ముద్ర వేస్తారు. చండశాసనుడిగా భావించి భయపడుతూ ఉంటారు. అందుకే వసంత ఋతువులో సూర్యుడిలా కాస్త చల్లగా, కొంత వెచ్చగా ఉంటేనే పాలకుడు రాణించగలడు.

**4. వినదగు నెవ్వరు చెప్పిన... :** ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకూడదు. ఇతరుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అలాగని కనిపించిన వారినల్లా సలహాలు అడగడం తగదు. అందుకే సమర్థులైన కొంతమంది సలహాదారులను నియమించుకోవాలి. వారితో సంప్రతిస్తూ, అభిప్రాయాలను తెలుసుకుంటూ ఉండాలి. ముఖ్యంగా నాయకుడు తీసుకోబోయే నిర్ణయాలు ముందే వెల్లడి కాకుండా చూసు కోవాలి. విఫలప్రయత్నాలనూ, వైఫల్యాలనూ కింది వరకు చేరకుండా చూసుకోవాలి.

**5. సహృదయ స్పందన :** అధినేతగా ఉన్న వ్యక్తి తనపై ఆధారపడిన, కింద పనిచేస్తున్న వారి సమస్యలకు సహృదయంతో స్పందించాలి. వారి భారాన్ని అర్థం చేసుకొని, బాధ్యతలకు చేయందించాలి; తల్లిలా అర్థం చేసుకొని ఆదరించాలి. అదేవిధంగా పాలకుడైన వ్యక్తి పాలితుల సమస్యలను వారి దృష్టి కోణం నుంచి చూడడం అలవాటు చేసుకోవాలి. వారి కష్టనష్టాలకు ప్రతిస్పందించాలి.

**6. ధార్మిక జీవనంతో మార్గదర్శనం:** ముఖ్యంగా నాయకుడి హోదా కన్నా, అతని జీవనశైలే కింది వారిని ఎక్కువ ప్రభావితం చేస్తుంది. ధర్మ విరుద్ధంగా, నీతి నియమాలకు తిలోదకాలిచ్చి కల్పించుకునే సుఖభోగాలు నాయకుడి కీర్తిని కళంకపరుస్తాయి. అందుకే ఎంతటి క్లిష్టపరిస్థితుల్లో కూడా అతడు నైతికమార్గాన్ని విడువకూడదు. తాత్కాలిక సుఖాల కోసం అడ్డదారులు తొక్కకూడదు.

**7. ఫలాలు... ఫలితాలు :** రాజ్యానికి రాజైనా, ఒక సంస్థను నడిపే నాయకుడైనా ఫలితాలు సంపూర్ణంగా



వస్తున్నాయో, లేదో పరిశీలించుకోవాలి. ముఖ్యంగా పాలకుడైతే వ్యవస్థలోని అట్టడుగు ప్రజలకు తన ప్రణాళికా ఫలాలు చేరుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. అదే విధంగా తన ప్రతినిధులుగా విధేయులు, అనుయాయులు ఎలా ప్రవర్తిస్తున్నారో గమనించాలి. వారి వ్యవహారశైలిపై ఓ కన్నేసి ఉంచాలి. లేనట్లయితే విధేయుల, అనుచరుల పనితీరు వల్ల నాయకుడి ప్రతిష్ఠ దెబ్బతింటుంది.

**8. సమర్థ సహచరులు :** నాయకుడు తన ప్రణాళికల్నీ, ఆలోచనల్నీ ఫలవంతం చేసుకోవాలంటే సమర్థులైన అనుచరు లుండాలి. అందుకే ముందు తన కార్యవర్గంలో అలాంటి వ్యక్తులనే నియమించుకోవాలి. కార్యనిర్వహణ, సిబ్బంది పనితీరు బట్టి వారి నాయకుడిని అంచనా వేయవచ్చు. వారి ప్రవర్తన, పనితీరు, సంబంధిత అధినేత సామర్థ్యాన్ని ప్రతిఫలిస్తాయి. అందుకే నాయకుడి ప్రణాళికలకు కార్యరూపం ఇచ్చే సిబ్బంది సుశిక్షితులై ఉండాలి. అప్పుడే నాయకుడు తన లక్ష్యాలను అనుకున్న రీతిలో నెరవేర్చుకోగలడు.

**9. పరిధి నెరిగి ప్రవర్తన :** అనుచరులతో, తన ఆదేశాలను అనుసరించే సిబ్బందితో నాయకుడు పరిధినెరిగి మసలుకోవాలి. వారితో ఎంత వరకు చనువుగా ఉండాలో అంతవరకే ఉండాలి. స్థాయిని మించి వారిని తన పరిధిలోకి రానివ్వడం ప్రమాదకరం! ఆ ప్రభావం పనిపై పడుతుంది; దారి తప్పించే అవకాశముంటుంది. చెప్పిన పనిని చేయక పోవడం, వాయిదా వేయడం, సక్రమంగా నిర్వర్తించక పోవడం జరుగుతుంది. అందుకే నాయకుడు తనకంటూ ఒక పరిధిని నిర్ణయించుకొని, అంత వరకే కిందివారిని అనుమతించాలి.

**10. కష్టే ఫలి! :** మార్గదర్శి అయిన వ్యక్తి ప్రయత్నశీలుడై, కష్టించి పనిచేయగలిగి ఉండాలి. అప్పుడే కిందివారు అతణ్ణి ఆదర్శంగా తీసుకుంటారు. తను మాత్రం సేదతీరుతూ, తనవారిని శ్రమించమంటే సత్ఫలితాలు రావు. అందుకే దేవతల గురువు బృహస్పతి 'అవిశ్రాంతంగా శ్రమించడం వల్లనే దేవతలు అమృతాన్ని సాధించగలిగారు; అసురులపై ఆధిపత్యాన్ని సాధించగలిగారు. అలాగే కష్టపడడం వల్లే ఇంద్రుడు, దేవేంద్రుడై స్వర్గాన్ని పరిపాలించగలిగాడు' అంటారు. మాటల్ని కోటలు దాటించే అధినేత కన్నా, చేతలతో అద్భుతాలు సృష్టించగలిగేవాడే నిజమైన నాయకుడు. ❖



## విలువలే విద్యకు శోభ

వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో విద్య కన్నా ముందు విలువలు ముఖ్యమని ప్రగాఢంగా నమ్మిన 'భారతరత్నం', నోబెల్ విజేత సర్ సి.వి. రామన్. వ్యక్తిగత జీవితంలో తను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించి చూపించారాయన. ఓ మారు ఆయన రామన్ పరిశోధన సంస్థలో ఉద్యోగానికి అభ్యర్థులను ఆహ్వానించారు. ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్న అభ్యర్థి యథావిధిగా ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కానీ అతని అర్హతలు ఆ ఉద్యోగానికి సరిపోలేదు. వెంటనే సి.వి.రామన్ ఆ అభ్యర్థికి రానూ పోనూ ఖర్చులు, ఇతర ఖర్చులు చెల్లించి వెనక్కు పంపించారు. ఆ డబ్బుతో వెనుదిరిగిన సదరు అభ్యర్థి సాయంత్రం మళ్ళీ సంస్థ ఆవరణలోనే రామన్‌కి కనిపించాడు. ఉదయమే వెళ్ళాల్సిందిగా చెప్పినప్పటికీ, ఆ యువకుడు సాయంత్రానికి అక్కడే కనిపించేసరికి ఆశ్చర్యపోయారు రామన్. 'ఉదయమే నిన్ను వెళ్ళమని చెప్పేశాం కదా! ఇంకా ఇక్కడే ఉన్నావేంటి?' అని ప్రశ్నించారు. వెంటనే ఆ యువకుడు నిర్మలంగా 'ఉదయమే నేను వెళ్ళిపోయాను సర్. కానీ మీ కార్యాలయ సిబ్బంది ఇచ్చిన డబ్బులు లెక్కపెట్టుకునేసరికి, నాకు రావాల్సిన దాని కన్నా ఎక్కువున్నాయని తెలిసింది. వాటిని తిరిగి ఇచ్చేద్దామని వెనక్కు వచ్చాను' అంటూ ఆ పైకాన్ని సి.వి. రామన్ చేతికిచ్చాడు. ఆ యువకుడి నిజాయతీకి చలించిపోయి 'నిన్ను ఉద్యోగానికి ఎంపిక చేస్తున్నాను. నువ్వు భౌతికశాస్త్రం (ఫిజిక్స్)లో కాస్త వెనకబడి ఉండవచ్చు. అది నేనెలాగైనా నేర్పించగలను. కానీ, నీలో విలువలతో కూడిన వ్యక్తిత్వం ఉంది. అది శిక్షణతో వచ్చేది కాదు. అది చాలు నాకు' అంటూ కరచాలనం చేశారు సర్ సి.వి. రామన్. ❖

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★



# పలికెడిది భాగవతం

# కపటమింత లేదు కరుణ కలదు

– స్వామి జ్ఞానదానంద

విజ్ఞతతో కూడిన విదురుడి హితవాక్యాలు విని, కనువిప్పు కలిగి అతనితోనే కలసి ధృతరాష్ట్ర దంపతులు అరణ్యాలకు పయనమయ్యారు. మరునాడు ఉదయమే యథావిధిగా తన దినచర్యలో భాగంగా, పెదనాన్న, పెద్దమ్మ, పినతండ్రిలకు నమస్కరించేందుకు ధర్మరాజు రాజమందిరానికి విచ్చేశాడు. అయితే అక్కడ ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు కనిపించలేదు. దాంతో ఆ పాండవాగ్రజుడు పలవరించిపోయాడు. అదే భవనంలో సుదూరంగా సుఖాసీనుడైన సంజయుడితో యుధిష్ఠిరుడు కలవరపాటుతో "సంజయా! మా పెత్తల్లీ, పెదతండ్రీ ఈ మేడలో కనిపించడం లేదు. వారెక్కడికి వెళ్ళారో తెలియదు. మా పెదతండ్రి గారు కంటిచూపు కరవైన ముదుకాళ్ళ ముసలి. మా పెద్దమ్మ కడివెడు శోకంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఉంటుంది. మా పినతండ్రిగారు మాకు ప్రాణ సమానుడు, సౌజన్యమూర్తి. ఈ ముగ్గురూ మమ్మల్ని వదలిపెట్టి ఎటు వెళ్ళిపోయారో తెలియదు. మా పెదనాన్న ఒకవేళ తాము చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది భార్యతో కలసి గంగలో దూకాడేమోనని అనుమానంగా ఉంది" అని ఆవేదనపడుతూ...

**భార్యతోడ తండ్రి పరితాపమున బడు**
**కపటమింత లేదు కరుణ కలదు**
**పాండు భూవిభుండు పరలోకగతుడైన**
**మమ్ము పిన్నవాండ్ర మనిచె నతడు...** అని కన్నీరు మున్నీరుగా విలపించాడు. ధర్మరాజు పితృప్రేమ చూసి సంజయుడు కరిగిపోయాడు. కన్న తల్లితండ్రులు కాకపోయినా, పెదనాన్న, పెద్దమ్మ, పినతండ్రిల విషయంలో యుధిష్ఠిరుడు ఎంతో మన్ననతో మెలిగేవాడు. వార్ధక్యంలో పెద్దల విషయంలో పిల్లలు ఎలా మసలుకోవాలో ఆ పాండవాగ్రజుడు పాటించి చూపాడు.

**సార్థక నామధేయుడు:** మహాభారతంలో యుధిష్ఠిరుడంటే సాక్షాత్తూ ధర్మస్వరూపుడు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సత్యాన్నీ, ధర్మాన్నే నమ్ముకొని ముందుకు నడిచినవాడు. నిజానికి పాండవులకు తీరని ద్రోహం చేశారు కౌరవులు. వారి గృహానికి నిప్పంటించారు; ద్రౌపదిని నిండుసభలో అవమానించారు; ఆ అమాయకుల్ని అన్యాయం చేసి అరణ్యాలకు వెళ్ళగొట్టారు. ధృతరాష్ట్రుడు ఏ సందర్భంలోనూ కొడుకులను వారించలేదు; పాండవుల విషయంలో జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డు చెప్పలేదు. అయినా ధర్మరాజు ఇవేవీ మనస్సులో పెట్టుకోలేదు. పైగా పెదనాన్నను '**కపటమింత లేదు; కరుణ కలదు**' అని శ్లాఘిస్తూ తన హృదయవైశాల్యాన్ని చాటుకున్నాడు. తమను కని, పెంచి ప్రయోజకుల్ని చేసిన కన్నవారినే కనికరం లేకుండా వదిలేస్తున్నవారు, ఇలాంటి ధర్మాత్ముల నడవడికను చూసి ఎంతో నేర్చుకోవాలి. ఇంటికి పెద్దగా, వంశానికి వారసుడిగా, రాజ్యాధినేతగా ఆ పాండవాగ్రజుడి పరిణతితో కూడిన ప్రవర్తన పదుగురికి ఆదర్శం.

ధర్మనిరతితో ఆ కుంతీపుత్రుడు సాక్షాత్తూ శ్రీకృష్ణభగవానుడి అభినందనలను, ఆశీస్సులను అందుకున్నాడు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు కూడా ఓ సందర్భంలో తమ భక్తులతో "కౌరవవంశంలో పుట్టిన మహాపురుషుడు యుధిష్ఠిరుడు. అలాంటి వ్యక్తి తమ వంశంలో వేయి దోషాలున్నా ఆ వంశజులను ఉద్ధరిస్తాడు. ధర్మరాజు సుగుణాల కలబోత. పాండవుల విషయంలో దుర్యోధనుడు పగబూనాడు; అడవుల పాల్జేశాడు. నానా కష్టాలు పెట్టాడు. అయినా కౌరవులను గంధర్వుడు బంధించినప్పుడు తమకు చేసిన అపకారాన్ని మరచి వారిని విడిపించాడు. అదీ అతని గొప్పతనం" అన్నారు.

**ధర్మాత్ముడు... ధన్యాత్ముడు:** మనం ఈ రోజుల్లో ఏదో ఒక నెపంతో విలువలకు తిలోదకాలిస్తూ, చేసే తప్పుడు పనులకు సమర్థనలు వెతుక్కుంటూ, మంచికి కాలం లేదని అవకాశవాదులుగా మారిపోతూ, మరోవైపు దెబ్బకు దెబ్బ తీయాలని తహతహలాడుతూ ఉంటాం. కానీ పరిస్థితులు ఎంత ప్రలోభపెట్టినా మహాపురుషులు సత్యానికీ, ధర్మానికీ కట్టుబడే ఉంటారు. కాలాతీత వ్యక్తులుగా నిలిచిపోతారు. దుర్యోధనుడు, శకుని, కర్ణుడు, దుశ్శాసనాదులు పాండవుల పట్ల ధర్మం తప్పి వ్యవహరించారు. అరణ్యవాసమే కాక అజ్ఞాతవాసమూ చేయాలని



ఆజ్ఞాపించారు. ఆ కష్టకాలంలో దాయాదుల దాష్టీకాలు భరించలేక, తమ్ముళ్ళు, భార్య ద్రౌపది ఎంతో కుమిలిపోయారు. చివరకు ఓ రోజు భీముడు, "రాజా! మనం ఈ విధంగా ధర్మార్థ కామాలకు దూరమై అరణ్యంలో నివసించడం బాగా లేదు. నీ మూలాన మేమందరమూ ఈ విధంగా 'ధర్మం, ధర్మం' అంటూ ఓర్పు వహిస్తుంటే శత్రువులు మనల్ని చేతకానివాళ్ళనుకుంటారు. ఏ ధర్మం తనకూ, మిత్రులకూ బాధాకరంగా ఉంటుందో అది ఒక దుర్వ్యసనం, ఆ ధర్మం కుధర్మం" అన్నాడు. అప్పుడు ధర్మరాజు ఎంతో నిబ్బరంతో...

**మమ ప్రతిజ్ఞాం చ నిబోధ సత్యాం, వృణే ధర్మమమృతాజ్జీవితాచ్చ।**
**రాజ్యం చ పుత్రాశ్చ యశో ధనం చ సర్వం న సత్యస్య కలాముపైతి॥**

'నా ప్రతిజ్ఞ సత్యమైందని తెలుసుకో! అమృతం కంటే, జీవితం కంటే ధర్మాన్నే నేను అధికంగా కోరుకుంటాను. రాజ్యం గాని, పుత్రులు గాని, యశస్సు గాని, ధనం కాని సత్యంలో పదహారో వంతుకు కూడా సరితూగవ'ని స్పష్టం చేశాడు. అందుకే ఆ ధర్మాత్ముడు ధన్యాత్ముడయ్యాడు.

**ఆశ్రిత పాలకుడు...ఆదర్శనాయకుడు:** నమ్ముకున్న విలువల విషయంలోనే కాదు, తనను నమ్ముకున్న వ్యక్తుల విషయంలో కూడా యుధిష్ఠిరుడు ధర్మనిరతిని తప్పనివాడు! అందుకే యక్షుడి ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, చనిపోయిన తమ్ముళ్ళలో ఎవరి ప్రాణాలు కావాలో కోరుకొమ్మంటే తన సొంత తమ్ముళ్ళయిన భీముడి, అర్జునుడి ప్రాణాలు కాకుండా, పినతల్లి మాద్రి కొడుకైన నకులుడి ప్రాణాలు కోరుకున్నాడు. చివరకు స్వర్గంలో అడుగుపెట్టే సమయంలో కూడా తనను నమ్మి వచ్చిన శునకానికి ప్రవేశం కల్పిస్తేనే, నేనూ స్వర్గంలోకి వస్తానని పట్టుపట్టాడు. దేవతలు ధర్మరాజుకు, అతని సోదరులు నరకంలో బాధపడుతూన్నట్లు మాయాబలం చేత చూపించి, 'నీవు మాత్రం ఉత్తమలోకాలకు వెళ్ళవలసి ఉంది; రా! తీసుకొని వెళతాం!' అంటారు. అప్పుడు ధర్మరాజు 'నేను కూడా నా బంధుజనంతో ఈ నరకంలోనే ఉంటాను; నాకు మీరిచ్చే ఉత్తమ లోకాలతో పని లేదు' అంటాడు. ఆ మాటలు విని, దేవతల్లోని ధర్మదేవుడు అతనితో 'కుమారా! నేను నిన్ను యక్షుడిగా కనబడి ప్రశ్నలు వేసినప్పుడు, శునకంగా నీ వెంట వచ్చినప్పుడు పరీక్షించాను. ఇది మూడవ పరీక్ష. అన్ని పరీక్షల్లోనూ నీ ధర్మస్థైర్యాన్ని నిరూపించుకున్నావు' అని మెచ్చుకుంటాడు. ఇలా ఎన్నో సందర్భాల్లో యుధిష్ఠిరుడు నైతిక నిబద్ధత నుంచి కించిత్తు కూడా పక్కకు తప్పుకోలేదు. ఎన్నో శక్తిసామర్థ్యాలున్నప్పటికీ ప్రదర్శనకూ, అహంకారానికీ పోకుండా సౌమ్యత్వానికీ, సౌహార్దానికే అతడు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. అందుకే తిక్కన గారు ఆయనను 'మెత్తని పులి' అని అభివర్ణించారు.

**కేవల మర్త్యుడే ధర్మసుతుడు... :** ఇంటికి పెద్ద అయినవారు మాటలతో కన్నా, ప్రవర్తనతో చిన్నవారిని ప్రభావితం చేయగలగాలి. అలా తన తమ్ముళ్ళకే కాదు తన వారందరికీ ఆ పాండు నందనుడు గౌరవనీయుడయ్యాడు. అందుకే విరాట పర్వంలో ఓ మారు ద్రౌపది తన భర్త ఘనతను కొనియాడుతూ, ఆయన మామూలు మనిషి కాదు...

**ఎవ్వని వాకిట నిభమద పంకంబు; రాజభూషణ రజోరాజి నడగు**
**నెవ్వని చారిత్రమెల్ల లోకములకు నొజ్జయై వినయంబు నొరపు గరపు**
**నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి మానిత సంపద లీనుచుండు**
**నెవ్వని గుణలత లేడు వారాసుల కడపటి కొండపై కలయబ్రాకు**
**నతడు భూరి ప్రతాప మహాప్రదీప**
**దూర విఘటిత గర్వాంధకారవైరి**
**వీర కోటిరమణివేష్టితాంఘ్రి**
**తలుడు కేవల మర్త్యుడె ధర్మసుతుడు**

"ఎవరి ముంగిట్లో మదపుటేనుగుల శరీరాల నుంచి కారే మదజలధారల వలన ఏర్పడిన బురదను, ఆయనను

> **'ధర్మం' అనగానే రామాయణంలో శ్రీరామచంద్రుడు స్ఫురిస్తాడు; మహాభారతంలో ధర్మరాజు గుర్తొస్తాడు. ధర్మదేవుని అంశావతారమైన యుధిష్ఠిరుడిని నాయకుడిగా చేయడం ద్వారా పంచమవేదమైన మహాభారతాన్ని ధర్మోపదేశ ప్రధాన గ్రంథమని వ్యాసుడు సూచించాడు.**
>
> **ప్రత్యర్థులలో కూడా పవిత్రతను చూసే గుణగ్రహణ పారీణత్వం ఆ పాండవాగ్రజుడిది. ఆయనను ధర్మం నుంచి తప్పించడం సాక్షాత్తూ దేవతలకే సాధ్యం కాలేదు. అందుకే ధర్మరాజు లాంటి కుమారుడు ఒక్కడున్నా, ఆ వంశమే తరించిపోతుంది.**

సేవించడానికి వచ్చే మహారాజుల అలంకారాల ఒరిపిడి వల్ల రాలిన ధూళి కలిగిన దుమ్ము అణచివేస్తుందో... ఎవరి ఉత్తమ ప్రవర్తన లోకాలకన్నిటికీ ఆదర్శమై, వినయ వర్తనానికి ఒరవడి అవుతుందో... ఎవరి కటాక్ష వీక్షణం గొప్ప సంపదలను కలుగజేస్తుందో... ఎవరి సుగుణాలనే తీవెలు సప్తసముద్రాలు దాటి మేరు పర్వతం మీదకు కలయ పాకుతాయో... ఎవరి పరాక్రమమనే ఘనదీపం శత్రువుల గర్వమనే అంధకారాన్ని దూరంగా పారదోలుతుందో... ఎవరి పాదాలు శత్రువీరుల కిరీటాలలోని రత్నకాంతులతో సదా చుట్టబడి వెలిగిపోతూ ఉంటాయో... అలాంటి ధర్మరాజు కేవలం మానవుడా? కాదు!" అని కీర్తిస్తుంది.

మనసంతా స్వార్థపూరితంగా మారిపోయిన మన తరం, సంపూర్ణంగా ఆ స్థాయిలో ధర్మాన్ని అనుష్ఠించలేకపోయినా, కొంతైనా అనుసరించగలిగితే అలాంటి పుణ్యాత్ములు పుట్టిన భూమిలో పుట్టినందుకు సార్థకతను చేకూర్చుకున్న వారమవుతాం. ❖

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

# సమష్టిశక్తికి సమన్వయ సూత్రాలు

– దిలీప్‌కుమార్ దత్తా

సమున్నత లక్ష్యాలతో కూడిన సంఘం (ORGANIZATION) పటిష్ఠంగా ముందుకు నడవాలంటే అందులోని సభ్యుల సమష్టి కృషే ప్రధానం. నలుగురు కలసి పనిచేసే చోట ఎలాంటి ఒడుదుడుకులు ఎదురవుతాయో, పొసగని మనస్తత్వాలతో పరిస్థితులు ఎక్కడికి దారి తీస్తాయో అన్ని సంఘాలకూ అనుభవైక వేద్యమే! చివరకు ఆధ్యాత్మిక సంస్థలు కూడా దానికి అతీతం కాదని తమ దార్శనికతతో స్వామి వివేకానంద నూటా ఇరవై అయిదేళ్ళ క్రితమే ఊహించారు. అందుకే స్వామీజీ ఎన్నో ప్రసంగాల్లో, సోదర సన్న్యాసులకు, ఇతర ప్రముఖులకు రాసిన ఉత్తరాల్లో సంఘం, సంఘటితంగా పనిచేయడం తదితర అంశాలపై విలువైన సూచనలిచ్చారు. నాయకత్వ దృష్టితో ఆ దార్శనికుడు ఆనాడు వెలిబుచ్చిన భావనలు నిత్యనూతనమే అనడంలో సందేహం లేదు. సంఘం, సంఘటితంగా పనిచేయడం లాంటి అంశాలపై స్వామి వివేకానంద ఇచ్చిన సూచనలను పన్నెండు సూత్రాలుగా క్రోడీకరించుకోవచ్చు.

**ORGANIZATION...**

Obedience - విధేయత
Reinforcement - సామర్థ్యాన్ని దృఢతరం చేయడం
Goal - లక్ష్యం
Accumulation and coordination of wills - సంకల్పశక్తుల సమీకరణ, సమన్వయం
Network - సంశక్తిజాలం
Ideal of harmony - ఆదర్శంలో సామరస్యం
Zeal - అభినివేశం, ఉత్సాహం
Attention - సావధానం
Thoughts - భావనలు
Impartial - నిష్పాక్షికత
Oblation - ఆహుతి, సమర్పణ
Nation-building - దేశ నిర్మాణం

**విధేయత:** సంఘంలోని సభ్యులకు ఉండాల్సిన ప్రధాన లక్షణం – సంఘం పట్ల విధేయత అని స్వామి వివేకానంద తరచూ తన సోదర సన్న్యాసులకు చెబుతూ ఉండేవారు. తనకు నీడనిచ్చిన సంఘాన్ని, అందులోని సభ్యులను ప్రేమించలేని వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ సమర్థంగా పనిచేయలేడనీ, సత్ఫలితాలను సాధించలేడనీ వారు స్పష్టం చేస్తారు. ఓ మారు స్వామీజీ తమ మిత్రునికి లేఖ రాస్తూ 'నీకు నీ సంఘంపై పూర్తిగా కృతజ్ఞతాభావం ఉండాలి. అవిధేయతకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదు. విధేయతను చూపించని వ్యక్తి నీ సమూహంలో ఉండకుండా జాగ్రత్త పడు! అంటూ You must be as free as the air, and as obedient as this plant and the dog... సంఘంలో గాలిలా స్వేచ్ఛగా ఉంటూనే, మరోవైపు ఓ మొక్కలా, విశ్వాసంతో ఇంట పెరిగే పెంపుడు కుక్కలా విధేయతతో మసలుకోవాలని హితవు పలికారు.

**సామర్థ్యాన్ని దృఢతరం చేయడం:** సంఘం దృఢంగా ఉండాలంటే అందులో పనిచేసే వ్యక్తులు మానసికంగా, శారీరకంగా శక్తిమంతులై ఉండాలి. ఒత్తిళ్ళను తట్టుకునే అదనపు సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించాలి. కలసి పనిచేసే చోట ఒళ్ళు దాచుకునే మనస్తత్వాన్నీ, బాధ్యతల నుండి





తప్పించుకునే మనస్తత్వాన్నీ విడనాడమనీ, ఇలాంటివి తాత్కాలికంగా సంఘానికి నష్టం చేయడంతో పాటు శాశ్వతంగా వ్యక్తిని పతనమొందిస్తాయని స్వామి వివేకానంద హెచ్చరించేవారు. ముఖ్యంగా సంఘ సభ్యులపై, సహచరులపై నిందారోపణలు చేయడం, చాటుగా చెడుగా మాట్లాడుకోవడం తగదనేవారు.

"నలుగురితో కలసి పనిచేస్తున్నప్పుడు, ఎదుటివారిలోని దోషాలను గోరంతలు కొండంతలు చేసి చూడడం మానుకోవాలి. ప్రతిదాన్నీ మనస్సులోకి తీసుకోకుండా మన్నించడం, మరచిపోవడం అలవాటు చేసుకుంటే మనకూ, సహచరులకూ మధ్య దీర్ఘకాల విభేదాలు పొడసూపవు" అనేవారు స్వామీజీ.

**లక్ష్యం:** సంఘంలో మనం పనిచేస్తున్నప్పుడు సామూహిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మన లక్ష్యం పరోక్షంగా సంఘంపై, సంఘ సభ్యులపై సానుకూల ప్రభావాన్ని చూపాలి. సంకుచిత స్వభావంతో స్వలాభానికే పరిమితమైన లక్ష్యం సంఘుస్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది అంటారు స్వామీజీ.

**సంకల్పశక్తుల సమీకరణ, సమన్వయం:** సంఘ నిర్మాణంలో, నిర్వహణలో సంకల్పశక్తులను సమీకరించుకోవడం, సమన్వయ పరచుకోవడం అత్యంత ప్రధానం. సభ్యులకు ఎన్ని సంకల్పశక్తులున్నా వారి మధ్య సమన్వయం లేకపోతే అవన్నీ వృథా అవుతాయి. అదే ఉద్దేశంతో స్వామి వివేకానంద తమ సోదర సన్న్యాసి శిష్యులైన శశి మహరాజ్ (స్వామి రామకృష్ణానంద)కి ఓ మారు లేఖ రాస్తూ "The success of your undertakings depends wholly upon your mutual love" అంటారు. పరస్పర ప్రేమతో, సమన్వయ ధోరణితో కలసి పనిచేయనప్పుడు సంఘం ముందుకు సాగడం గగనమైపోతుంది. అయితే నేడు చాలా చోట్ల వ్యక్తిగతంగా సంఘసభ్యులు సంకల్పశక్తి సమృద్ధిగా కలిగినవారే! కానీ సమూహంలోకి వచ్చేసరికి మాత్రం సమన్వయం కొరవడుతోంది.

**సంశక్తిజాలం:** సంఘ నిర్మాణం, దాని పనితీరు అందులోని బలగంపై ఆధారపడి ఉంటుందని స్వామీజీ విశ్వసించేవారు. అందుకే నలుగురు కలసి పనిచేసే చోట నాయకుడైన వ్యక్తి బలగంలోని సభ్యులు సంఘుస్ఫూర్తిని కోల్పోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. 'సంస్థకు సభ్యులు, సభ్యులకు సంస్థ' అన్నట్లుగా అవినాభావ సంబంధం కొనసాగేలా మసలుకోవాలి.

**ఆదర్శంలో సామరస్యం:** ఏ సంస్థలోనైనా పని విభజన అన్నది చాలా ముఖ్యమైన విషయం. ఈ 'పని విభజన' ఎలా ఉండాలనే అంశంపై స్వామీజీ స్పష్టమైన సూచనలిచ్చారు. 'ఎవరికి తోచింది వారు చేయడం కాకుండా, సామరస్యపూర్వకమైన ధోరణిలో ఒకరికొకరు చేయూతగా ఉండాలి. అలా వారు చేస్తున్న పని తుదకు సంస్థకు సత్ఫలితాలను ఇవ్వాలి' అనేవారు.

**అభినివేశం, ఉత్సాహం:** సంస్థ సభ్యులకు ఉండాల్సిన మరో ముఖ్య లక్షణం – చేసే పనిలో అభినివేశం, ఉత్సాహం. ఉదాసీనంగా పనిచేసే వ్యక్తులు సంస్థకు నష్టం చేసినవాళ్ళవుతారు. ఉత్సాహవంతులే సంస్థకు బలం. 'ఉత్సాహం ఉరకలేస్తూ విజ్ఞానవంతులు, ధీరులు అయిన చురకత్తుల్లాంటి యువతీ యువకులు కొద్దిమంది చాలు – సంస్థ దూసుకుపోవడానికి!' అని స్వామి వివేకానంద అంటారు.

**సావధానం:** స్వామి వివేకానంద ఓ చోట ఇలా అంటారు: 'One of the greatest lessons I have learnt in my life is to pay as much attention to the means of work as to its end'. లక్ష్యంపై ఉన్న శ్రద్ధ లక్ష్యసాధనపై లేనప్పుడు అది దీర్ఘకాల ఫలితాలనివ్వదు. సంస్థ నాలుగు కాలాల పాటు పటిష్ఠంగా నడవాలంటే ఇలా గమ్యం, గమనంపై సరిసమానమైన శ్రద్ధ కలిగి ఉండాలి. ఏదో రకంగా లక్ష్యాన్ని చేరుకోవాలనే తాపత్రయంతో అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేయడం ప్రమాదకరం. అలాంటి చర్యలతో తాత్కాలికంగా ప్రయోజనాన్ని పొందినా, కాలక్రమంలో అటు సంస్థకూ, ఇటు వ్యక్తులకూ నష్టం వాటిల్లుతుంది. ఫలితంపై ఉన్న ఆసక్తి పనిపై లేకపోతే ఎక్కడో లోపం జరుగుతున్నట్లే! ఈ రోజుల్లో చాలా సంస్థలు పతనమైపోవడానికి ప్రధాన కారణం శ్రద్ధారాహిత్యమే!


**భావనలు:** సంస్థను ముందుకు నడిపించేది సృజనాత్మక భావనలే! స్తబ్ధతను వీడి నిరంతరం కొత్త కొత్త ఆలోచనలతో సంఘుసభ్యులు పనిలో పాలు పంచుకుంటున్నప్పుడు సంస్థ దినదిన ప్రవర్ధమానమవుతుంది. అయితే, నిర్మలమైన మనస్సు లోనే సదాలోచనలు అంకురిస్తాయనేవారు స్వామీజీ.

**నిష్పాక్షికత:** సంస్థ నిర్వాహకులు, నాయకులు విధిగా నిష్పాక్షికంగా నడచుకోవాలి. పక్షపాత బుద్ధి సంఘుస్ఫూర్తిని దెబ్బతీస్తుంది. సంస్థను ముందుకు నడిపేవారిలో పారదర్శకత లేకపోతే వెనక నడిచేవారు సంఘాన్ని తమదిగా భావించలేరని స్వామీజీ తమ శిష్యులకు రాసిన ఓ లేఖలో ఉద్ఘాటిస్తారు.

**సమర్పణ:** స్వామి వివేకానంద 'the attitude of all members of the organization should be to treat the organization as a temple and the job they perform should be like oblation' అంటారు. అంటే చేసే పని పట్ల పూజ్యభావం, సమర్పణాభావం లేకపోతే దానికి సంపూర్ణంగా న్యాయం చేయలేం. తృణీకారభావంతో, మొక్కుబడిగా బాధ్యతలను నిర్వహించడం వల్ల ఫలితం కూడా అదే స్థాయిలో ఉంటుంది. అందుకే సంస్థపై గౌరవం, పనిపై ఆరాధనా భావం ఉన్నవాళ్ళే ఘనమైన ఫలితాలకు కారకులు కాగలరు.

**దేశ నిర్మాణం:** పై పదకొండు సూత్రాలను పాటించే ఏ సంస్థ అయినా, సభ్యుడైనా పరోక్షంగా దేశ నిర్మాణానికీ, జాతి ప్రయోజనాలకూ తోడ్పాటునందించినవారే అవుతారు. మన పరిధిలో మనం నిర్వర్తించే ఏ పని అయినా, పరోక్షంగా మన సమాజ సంక్షేమానికి దోహదపడేదిగా ఉండాలి. అప్పుడే మనం సమాజపౌరుడిగా సంపూర్ణ పౌరసత్వ విధిని నిర్వర్తించిన వాళ్ళం అవుతామనేవారు స్వామి వివేకానంద. చివరగా నాయకుడనే వ్యక్తికి అద్భుతమైన నిర్వచనమిస్తూ స్వామీజీ 'సేవకులకు సేవకుడిగా తనను భావించుకునేవాడే నిజమైన నాయకుడు. నాయకుడైనవాడు వేల రకాల మనస్తత్వాలను కూడా జీర్ణించుకోగలిగినవాడై ఉండాలి' అంటారు. ❖

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.
www.freegurukul.org
Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org
★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★



# వి'నాయకుడి' విజయ సూత్రాలు

'అల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నాః' – కాలం కన్నా విఘ్నాలే అధికం. అందుకే విఘ్నాలను తొలగింప చేయడానికి విఘ్నేశ్వరుణ్ణి పూజించడం మన సంప్రదాయం. ఏ కార్యాన్ని తలపెట్టినా అందులో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించడానికి మనోబలాన్నీ, శక్తియుక్తుల్నీ ప్రసాదించి విజయాన్ని సిద్ధింపజేస్తాడు సిద్ధి వినాయకుడు.

మనకు ఎంతోమంది దేవీ దేవతలు ఉన్నప్పటికీ వినాయకుడి రూపానికి ఓ ప్రత్యేక ఆకర్షణశక్తి ఉంది. ఎందుకంటే – లంబోదరం, వక్రతుండం, ఏకదంతం, గజకర్ణం, మూషిక వాహనాలతో అలరారుతున్న గజాననుని రూపం ఆబాల గోపాలాన్నీ ఆకర్షిస్తుంది. అందులోనూ ముఖ్యంగా పిల్లలకు అత్యంత ప్రియతముడు, ఆరాధ్యదైవం ఆ విఘ్నరాజు. పిల్లలు వినాయకుని రూపాన్ని చూసి ఆకర్షితులవుతున్నారు. విద్యా బుద్ధులను ప్రసాదిస్తాడని ఆయనను ఆరాధిస్తున్నారు.

అయితే వినాయకుని రూపం కేవలం పిల్లలకే కాదు పెద్దలకు కూడా ఆదర్శనీయం, ఆరాధ్యనీయం. వినాయక రూపంలోని నిజతత్త్వం ఎన్నో విజయ సూత్రాలను తెలియజేస్తుంది. ఆ సూత్రాలను ఆచరిస్తే జీవితంలో ఉన్నతిని సాధించవచ్చు. ఎందరికో మార్గదర్శకులం కావచ్చు.

వినాయకుణ్ణి – సుముఖుడు, ఏకదంతుడు, శూర్పకర్ణుడు, లంబోదరుడు, వికటహాసుడు, వక్రతుండుడు అనే పేర్లతో సంబోధిస్తారు. అయితే వినాయకుని ఒక్కొక్క అంగం ఓ ప్రత్యేక సుగుణానికి ప్రతీక. ఆ సుగుణాలు కలవాడే సమర్థ నాయకుడని నిర్ధరించవచ్చు.

**సుముఖుడు:** ఎవరి ముఖం చూస్తే భయాందోళనలు తొలగిపోయి ఆత్మస్థైర్యం, ఆత్మశాంతి కలుగుతాయో అతడే 'సుముఖుడు'. వినాయకుణ్ణి 'ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే' అని ప్రార్థిస్తాం. ప్రేమాప్యాయతలు తొణికిసలాడే అతడి ప్రసన్న ముఖం చూడగానే మన మనస్సుకు ప్రశాంతత చేకూరుతుంది. అందుకే అతణ్ణి 'సుముఖుడు' అంటారు. కాబట్టి ప్రసన్న వదనం కలిగివుండడం నాయకునికి ఉండాల్సిన ప్రథమ లక్షణం.

**ఏకదంతుడు:** ఏనుగుకు అందాన్నిచ్చే ఆభరణాలు దానికున్న రెండు దంతాలు. కానీ వినాయకుడికి కుడి వైపు దంతం లేదు. ఎందుకంటే, వ్యాసమహర్షి ముఖతః వెలువడిన మహాభారత రచన నిరాటంకంగా కొనసాగడానికి తన కుడి దంతాన్ని విరిచి, ఆ దంతంతో భారతాన్ని లిఖించాడు వినాయకుడు. అలా మనకు పంచమ వేదమైన మహాభారతాన్ని అందించి వినాయకుడు ఏకదంతుడయ్యాడు. సమాజ ప్రయోజనం కోసం తాను వికటరూపునిగా మారడానికి కూడా సిద్ధమైన వినాయకుడు 'బాహ్య సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యమే ముఖ్యం' అని నిరూపించాడు.

'There must not be a shade of selfishness, then you are a leader – ఇసుమంతైనా స్వార్థం లేనివాడే నిజమైన నాయకుడు' అంటారు స్వామి వివేకానంద. కాబట్టి లేశమైనా స్వార్థచింతన లేకపోవడమే నాయకుడి లక్షణం.

**శూర్పకర్ణుడు:** వినాయకుడు చేటల్లాంటి పెద్ద చెవులు కలవాడు. పెద్ద చెవులు – ఎవరు ఏమి చెప్పినా విసుగు లేకుండా ఓపిగ్గా వినడానికి ప్రతీక.

'He who has infinite patience at his back, will alone succeed. సహనం ఉన్నవాడే సఫలీకృతుడు కాగలడు' అంటారు స్వామి వివేకానంద.

బియ్యంలోని రాళ్ళను తొలగించి కేవలం బియ్యాన్ని మాత్రమే తనలో ఉంచుకున్నట్లు, చేటల్లాంటి చెవులు మంచిని మాత్రమే స్వీకరించి, చెడును విస్మరించడాన్ని సూచిస్తాయి.




ఎవ్వరేమి చెప్పినా ఓపిగ్గా వినడం, విన్నవాటిలో మంచి చెడులను పరిశీలించిన తరువాతే అంగీకరించడం నిజమైన నాయకుడి లక్షణమని వినాయకుడి పెద్ద చెవులు తెలిపే సందేశం.

ఈ మహిలో మనిషి నీతిపరుడిగా వర్ధిల్లాలంటే...

**వినదగు నెవ్వరు చెప్పిన,**
**వినినంతనె వేగపడక వివరింపదగున్,**
**కని కల్ల నిజము తెలిసిన**
**మనుజుడె పో నీతిపరుడు మహిలో సుమతీ!**

'ఎవ్వరు చెప్పినా వినాలి. విన్న దాన్ని సావధానంగా ఆలోచించి నిజానిజాలను తెలుసుకోవాలి. అలాంటి వాడే ఈ లోకంలో నీతిపరుడు' అని సుమతీ శతకకారుడు అన్నాడు.

**లంబోదరుడు:** ఏ నైవేద్యాన్ని అర్పించినా జీర్ణించుకునే శక్తి కలవాడు వినాయకుడు. మెత్తని మధురమైన మోదకాలను సమర్పించినా, పచ్చికాయలను సమర్పించినా వినాయకుడు ప్రీతితో స్వీకరించినట్లు నిజమైన నాయకుడు ప్రశంసల వర్షం కురిసినా, విమర్శలు వెల్లువై ముంచెత్తినా రెండింటినీ సమానంగా స్వీకరించే సుగుణం కలిగివుండాలి. మనం అనుచరులతో, అనుయాయులతో కలసి పనిచేస్తున్నప్పుడు మనల్ని ప్రశంసించేవారూ, విమర్శించేవారూ ఉంటారు. ఆ రెండింటినీ జీర్ణించుకునే సహనశక్తి, విచక్షణాశక్తి ఉన్నప్పుడే ఏ కార్యాన్నైనా సమర్థంగా నిర్వహించగలం.



...it is a very difficult task to take on the role of a leader. One must be a servant of servants, and must accommodate a thousand minds. *-Swami Vivekananda*

కాబట్టి ఇతరులతో కలిసి పనిచేసినప్పుడు, పని చేయించినప్పుడు ఎన్నో మనస్తత్వాలను అర్థం చేసుకొని, సర్దుబాటు తనంతో వ్యవహరించడం అలవరచుకోవాలి.

**వికటహాసుడు:** నాయకుడు అనేవాడు ఎప్పుడూ గంభీరంగా ఉండాలనీ, అలా ఉంటేనే ఇతరుల నుండి మంచి నైపుణ్యాన్ని వెలికితీయవచ్చనీ, త్వరిత ఫలితాల్నీ సాధించవచ్చనీ భావించడం పొరపాటు. నాయకుడు తాను నవ్వుతూ, ఇతరులను నవ్వించగలిగినప్పుడే నిజమైన సత్సంబంధాలు ఏర్పడతాయి. సత్ఫలితాలూ కలుగుతాయి.

నిజానికి కల్మషం లేని మనస్సే హాస్యపు పంటను పండించగలదు. అందరికీ ఆహ్లాదాన్ని పంచగలదు. అందుకే కల్లాకపటం ఎరుగని పసి హృదయాలు ఎప్పుడూ చిరునవ్వుల జల్లులు కురిపిస్తూంటాయి. అలా పసిపిల్లవాడి లాంటి పవిత్రమైన మనస్సు కలవాడు గణపతి. అందుచేత ఆయన చేసిన ఏ పనైనా అందరికీ ఆహ్లాదాన్నిస్తుంది.

ఒకసారి విష్ణుమూర్తి సుదర్శన చక్రాన్ని వినాయకుడు మ్రింగేశాడు. ఆ చక్రాన్ని తిరిగి పొందాలంటే వినాయకుణ్ణి ఎలాగైనా నవ్వించాలి అని విష్ణువు తలచాడు. అప్పుడు విష్ణువు తన రెండు చెవులనూ చేతులతో పట్టుకొని గుంజిళ్ళు తీశాడు. విష్ణువు గుంజిళ్ళు తీయడం చూసిన వినాయకుడు వికటహాసం చేశాడు. అలా వినాయకుడు పెద్దగా నవ్వడం వల్ల అతడి నోటి నుండి సుదర్శన చక్రం క్రింద పడింది. అందుకే వినాయకుణ్ణి 'వికటహాసుడు' అని అంటారు.

కాబట్టి నిజమైన నాయకుడు తాను నవ్వడమే కాదు, ఇతరులు నవ్వించినప్పుడు తనూ నవ్వి ఆనందించగలగాలి. అప్పుడే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడి అందరూ సానుకూల భావాలతో సహకరిస్తారు.

**వక్రతుండుడు:** ఏనుగు తన తొండంతో పెద్ద స్తంభాన్ని ఎత్తగలదు. అలాగే నేలపై పడిన చిన్న సూదిని కూడా తీయగలదు. అంటే స్థూల విషయాలను గ్రహించడమే కాకుండా, సూక్ష్మ విషయాలను కూడా గ్రహించే శక్తి వినాయకుడికి ఉందని అర్థం.

స్తంభం ఎత్తడం అంటే గొప్ప కార్యాలను చేయడం. సూదిని తీయడం అంటే చాలా చిన్న పని సైతం చేయడం. సాధారణంగా ఉన్నత పదవుల్లో ఉన్నవారు చిన్న పనులను చేయడం నామోషీగా భావిస్తారు. అలాంటివారు ఎన్నటికీ ఆదర్శ నాయకులు కాలేరు. అందువల్ల నాయకుడు సూక్ష్మ విషయాలను సైతం గ్రహించే శక్తినీ; చేసే పని చిన్నదైనా, పెద్దదైనా చేయడానికి సంసిద్ధంగా ఉండే విశాల దృక్పథాన్నీ కలిగివుండాలి.

ఉత్తమ నాయకుడు ఎప్పుడూ పేరు ప్రఖ్యాతుల కోసం ప్రాకులాడడు. కేవలం ఆదర్శాలను మాత్రమే ఆచరించాలని ఆరాటపడతాడు. అందుకే జన్మతః నాయకుడైన స్వామి వివేకానంద ఇలా అన్నారు :

My name should not be made prominent; it is my ideas that I want to see realized... Work for the idea, not the person... *- Swami Vivekananda*

స్వామీజీ ఆశించిన విధంగా మనం ఆదర్శ నాయకులం కావాలంటే వినాయకుడు చెబుతున్న విజయ సూత్రాలను ఆచరణలో పెట్టాలి. ❖

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.
www.freegurukul.org
Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org
★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★




## నాయకుడవు కావాలంటే...

జనరల్ స్ట్రాంగ్ అని నాకొక ఆంగ్లేయ మిత్రుడు ఉండేవాడు. సిపాయిల తిరుగుబాటు సమయంలో అతడు భారతదేశంలో ఉన్నాడు. ఆ ఉద్యమం గురించి అనేక గాథలను నాకు చెబుతూ ఉండేవాడు. ఒక రోజున ప్రసంగవశాన నేను అతణ్ణి ఓ మాట అడిగాను. "తగినన్ని తుపాకులు, మందుగుండు సామాను, ఆహార సమృద్ధి ఉండి, యుద్ధ శిక్షణతో ఆరితేరినవారై ఉండి కూడా ఎందుచేత సిపాయిలు అంత ఘోరమైన ఓటమిని ఎదుర్కొన్నారు?" అని ప్రశ్నించాను.

అందుకు సమాధానంగా "అతడు నాయకులు ముందు వరుసలో ఉండి సైన్యాన్ని నడిపించ వలసింది పోయి, వెనుక ఎక్కడో భద్రమైన స్థలంలో ఉండి, 'పోరాడండి యోధులారా! ముందుకు సాగండి' అంటూ కేకలు పెట్టే వార"ని చెప్పాడు.

సైన్యాధిపతి ముందుండి చావును సైతం ఎదుర్కొనేందుకు సిద్ధపడి సైన్యాన్ని నడిపించకపోతే, సైనికులు హృదయ పూర్వకంగా యుద్ధం చేయలేరని అతడు తేల్చి చెప్పాడు.

ఏ రంగమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. నాయకుడైన వాడు ముందుగా ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలి. జీవితాన్ని ఒక కార్యసాధనలో పణంగా పెట్టగలిగినప్పుడే, నీవు నాయకుడవు కాగలవు. కానీ మనమందరం ఏ విధమైన త్యాగాలు చేయకుండానే నాయకులమవ్వాలని వాంఛిస్తాం. అందుకే ఫలితం శూన్యం. మనం చెప్పేది వినేందుకు ఎవరూ ఉండరు. ❖

## అసంగత్వం



దేన్నీ కావాలని కోరుకోకు. దేన్నీ వద్దని నిరసించకు. ఏది వస్తే దాన్ని రానివ్వు. స్వేచ్ఛ అన్నది దేని వల్లా భంగపడదు. ఊరకే భరించడమే సరిపోదు. అసంగుడవై ఉండు. అందుకు ఉదాహరణగా ఈ ఎద్దు కథను గుర్తు చేసుకోండి.

ఒక ఎద్దు కొమ్ము పైన దోమ ఒకటి చాలాసేపటి నుండీ కూర్చొని ఉంది. దాని మనస్సాక్షి కాసేపటికి దాన్ని బాధపెట్టింది. అప్పుడా దోమ, ఎద్దుతో ఇలా అంది:

"నందీశ్వరా! నేను చాలా సేపటి నుండీ ఇక్కడ కూర్చొన్నాను. నీకు నేను బాధ కలిగించాననుకుంటున్నాను. నన్ను క్షమించు. నేను వెళ్ళిపోతాను."

అందుకు ఆ ఎద్దు "అబ్బే! అదేమీ లేదు. నువ్వు, నీ కుటుంబ పరివారంతో సహా వచ్చి నా కొమ్ముపై కూర్చోండి. దాని వల్ల నాకేమీ హాని లేదు" అని సమాధానమిచ్చింది. ❖

## గాడిద మోత

చాలా సంవత్సరాల క్రితం మా దేశంలో ఒక జ్ఞానిని దర్శించాను. ఆయన చాలా పవిత్రుడు. మేము ఇద్దరం వేదాలు, బైబిలు, ఖురాన్, ఇతర పవిత్ర గ్రంథాల గురించి మాట్లాడుకున్నాం.

మా సంభాషణ ముగిసే ముందు ఆ మహానుభావుడు అక్కడే మేజా బల్ల మీద ఉన్న ఒక పుస్తకాన్ని తీసుకురమ్మన్నాడు. అందులో అనేక ఇతర అంశాలతో పాటు ఆ సంవత్సరం కురవబోయే వర్షపాతం గురించి కూడా వ్రాసి ఉంది. ఆ జ్ఞాని ఆ పుస్తకంలో వ్రాసి ఉన్న దాన్ని చదవమన్నాడు. నేను ఆ సంవత్సరం ఎంత వర్షం కురవనుందో ఆ పుస్తకంలో వ్రాసి ఉన్న సమాచారాన్ని చదివాను.

అప్పుడా జ్ఞాని ఇలా సూచించాడు... "ఆ పుస్తకాన్ని బాగా మెలిపెట్టి పిండు."

నేను ఆయన చెప్పినట్లే చేశాను.

"ఏం నాయనా! అందులో నుంచి ఒక్క నీటి బొట్టు కూడా పడలేదు! ఆ పుస్తకంలో వర్షపాతం గురించి వ్రాసి ఉన్నా ప్రయోజనం ఏమిటి? అదే విధంగా మతం భగవంతుణ్ణి దర్శింప చేయలేనంత వరకు అది వృథాయే. కేవలం మత గ్రంథాలను చదివి తృప్తి పడేవాడు... తన వీపు మీద బరువైన పంచదార బస్తాలను మోస్తున్నా, అందులోని పంచదార తియ్యదనాన్ని ఎరుగని గాడిద లాంటి వాడే సుమా!" అని ముగించాడు ఆ జ్ఞాని. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

నీవు అనంతశక్తి సమన్వితుడవు. నీలోని శక్తి ద్వారానే నీ కష్టాలను అధిగమించాలి. నిన్ను నీవే రక్షించు కోవాలి. నీకు ఎవరో సహాయం చేస్తారనుకోవడం ఒక మధుర భ్రాంతి మాత్రమే! -స్వామి వివేకానంద



"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★



# స్వామి వివేకానంద హాస్యచతురత

**– స్వామి రఘునాయకానంద**

**నా**యకునికి ఉండవలసిన లక్షణాలలో హాస్య చతురత కూడా ఒకటి. ఆ హాస్యచతురత నాయకునికి, అతని క్రింద పనిచేస్తున్నవారికి మధ్య బంధాన్ని పటిష్ఠం చేస్తుంది. స్వామి వివేకానంద జన్మతః నాయకులు. ఆయన మనస్సు ఎప్పుడూ అత్యున్నత స్థాయిలో ఉండేది. దాన్ని క్రిందకు తీసుకువచ్చి సామాన్య మానవులతో మాట్లాడడానికి కొంత హాస్యం అవసరమనిపించేది. స్వామీజీ హాస్యం భావగర్భితంగా ఉండేది. కొన్ని సమయాలలో గాంభీర్యం, ధైర్యం కానవస్తాయి.

ఒకరోజు స్వామీజీ లండన్‌లోని ఎథికల్ సొసైటీలో యోగంపై ప్రసంగించారు. ఆ ప్రసంగంలో ప్రాణాయామం గురించి గానీ, ఆహార నియమాల గురించి గానీ స్వామీజీ ప్రస్తావించలేదు. తరువాత ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ఆంగ్ల వనిత ఈ విధంగా ప్రశ్నించింది. 'Swami, what do you think about breathing and eating?' – స్వామీ! ప్రాణాయామం, ఆహార నియమాల పట్ల మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించింది. దానికి స్వామీజీ సమాధానం ఇస్తూ 'I assure you, madam, that I am in favour of both' 'అమ్మా! తప్పకుండా నాకు ఆ రెండూ ఇష్టమే' అన్నారు.

స్వామీజీ పరివ్రాజకుడిగా పర్యటిస్తూ హృషీకేశ్ చేరుకొన్నారు. వారితో పాటు సోదర సన్న్యాస శిష్యుడు స్వామి అఖండానంద కూడా ఉన్నారు. శంకరాచార్యులు ప్రారంభించిన దశనామి సన్న్యాస సంప్రదాయంలో గిరి, పురి, సరస్వతి లాంటి నామాలు సన్న్యాస నామధేయం చివర వచ్చేవి. (ఉదాహరణకు స్వామి మధుసూధన సరస్వతి, నిర్మలానంద గిరి..మొదలైనవి. రామకృష్ణ మిషన్ సన్న్యాసులు పురి సంప్రదాయానికి చెందినవారు) అక్కడ ఒకాయన స్వామీజీని ఈ విధంగా ప్రశ్నించాడు: "అయ్యా! మీరు ఏ సంప్రదాయానికి చెందినవారు? గిరియా? పురియా?" దానికి స్వామీజీ హాస్యంగా బదులిస్తూ, "గిరీ కాదు... పురీ కాదు... కచురీ (పూరీ లాంటి తినుబండారం)" అన్నారు.

1895వ సంవత్సరంలో స్వామీజీ సహస్ర ద్వీప వనంలో ప్రసంగాలు ఇస్తున్నప్పుడు ఒక ఆంగ్ల వనిత ఇలా ప్రశ్నించింది: "Swami! Are you a Buddhist?" (pronounced like bud) - స్వామి మీరు బౌద్ధులా?(ఆమె ఇంగ్లీషులో 'బుద్ధిస్ట్' అనకుండా 'బడ్డిస్ట్' అంది. ఇంగ్లీషులో బడ్ అంటే మొగ్గ). ఆ మాటకు స్వామీజీ ఇలా సమాధానమిచ్చారు – "No Madam! I am a flowerist." "కాదు మేడమ్! నేను ఫ్లవరిస్ట్‌ను." (ఫ్లవర్ అంటే పువ్వు కదా!)

స్వామి వివేకానంద 1894లో డెట్రాయిట్‌లో ఉన్నప్పుడు ప్రసంగానంతరం జరిగే ప్రశ్నోత్తరాలలో చిన్నప్పుడు వారి తల్లి భువనేశ్వరి దేవి గంగానదికి స్నానానికి తీసుకెళ్ళినప్పటి సంగతిని ప్రస్తావించారు. స్థూలకాయాన్ని చూసి మొసళ్ళు కూడా తనను మింగడానికి భయపడేవని హాస్యంగా చెబుతూ వచ్చారు. "నేను ఇంత లావుగా ఉండడం వల్లనే మొసలి కూడా నన్ను తినకుండా వదిలిపెట్టేసిందని సంబర పడేవాడిని"అని ఛలోక్తిగా చెప్పారు.

ఇతరుల ఛలోక్తులను కూడా స్వామీజీ ఆ విధంగానే ఆస్వాదించేవారు. స్వామీజీ చెన్నైలో ఉన్నప్పుడు ఉదయం అల్పాహారంగా ఉప్మా ఇచ్చారు. స్వామీజీకి చాలా నచ్చి, "ఇది తేలికపాటి మంచి ఆహారం. రుచికరమైనది కూడా!" అన్నారు. దాన్ని ఏ విధంగా చేస్తారో తెలుసుకోవాలనిపించి, వడ్డించిన వారిని అడిగారు.

అక్కడున్న వారిలో ఒకాయన ఉప్మా ఎలా తయారుచేస్తారో వివరించారు. అయినప్పటికీ స్వామీజీకి అర్థం కాలేదు. అక్కడే ఉన్న ఒక గణితశాస్త్ర అధ్యాపకుడు స్వామీజీకి ఇలా వివరించాడు: "Swamiji! Upma is nothing but Halva minus sugar plus salt" - హల్వా నుండి చక్కెర తీసేసి ఉప్పు కలిపితే ఉప్మా అవుతుంది అని చెప్పాడు. స్వామీజీ ఆ అధ్యాపకుడిచ్చిన వివరణ విని నవ్వుకొన్నారు. ❖



"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org


★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

Free Soft Copy Ramakrishna Math Hyderabad www.rkmath.org



# మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు

- ఆర్. కృష్ణ



## ఉపాధ్యాయుడినే మార్చిన ఉక్కుమనిషి

ఆ పాఠశాలలో ఆ ఒక్క ఉపాధ్యాయుడిదే రాజ్యం. తన తరగతిలో చదివే విద్యార్థులు తన దుకాణంలో అమ్మే పుస్తకాలే కొనాలన్నది అతని నిబంధన. అప్పటి వరకు ఆయన మాటే చెల్లేది... అదే విధానం కొనసాగేది. కాని ఒకసారి ఓ విద్యార్థి వేరే దుకాణంలో పుస్తకాలు కొనుక్కుని క్లాసులో అడుగుపెట్టాడు. ఆ విషయం ఆ ఉపాధ్యాయుడికి తెలిసి అగ్గిమీద గుగ్గిల మయ్యాడు. అందరి ముందు ఆ బాలుణ్ణి నిలదీశాడు. 'ఏం! నా మాట కూడా లెక్కచేయకుండా పుస్తకాలు వేరే దుకాణంలో కొంటావా? ఎంత ధైర్యం నీకు!' అంటూ గద్దించాడు. ఆ విద్యార్థి ఇసుమంతైనా తొణకకుండా 'అవును మాష్టారు! మీ పాఠాలు వినకపోతే భయపడాలి కానీ, పుస్తకాలు మీ దుకాణంలో కొనకపోతే కాదు కదా! అయినా పాఠాలు చెప్పాల్సిన మీరు వ్యాపారం చేయటం పద్ధతేనా?' అంటూ ఎదురు ప్రశ్నించాడు. ఉపాధ్యాయుడి వైఖరికి నిరసనగా తరగతి లోంచి వెళ్లిపోయాడు. ఆ మరునాడు అతడే కాదు, ఆ తరగతి విద్యార్థులెవరూ హాజరుకాలేదు. తరగతిని సామూహికంగా బహిష్కరించారు. ఆ తరువాత పెద్దల జోక్యంతో విద్యార్థులు దిగివచ్చారు. ఉపాధ్యాయుడు తన నిరంకుశ ధోరణికి సిగ్గుపడ్డాడు. తప్పు దిద్దుకున్నాడు. తన పద్ధతిని మార్చిన ఆ విద్యార్థిని అభినందిస్తూ అక్కున చేర్చుకున్నాడు. నిర్భీతితో గురువునే ప్రశ్నించిన ఆ విద్యార్థి ఎదిగి భారతజాతికి మహోన్నత నాయకుడయ్యాడు. అతడే ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్. స్వాతంత్ర్యోద్యమంలో ఉత్సాహంగా పాల్గొనటమే కాకుండా, దేశంలో చెల్లాచెదురుగా ఉన్న 565 సంస్థానాలను ఒక్కతాటి పైకి తెచ్చాడు. భరతభూమిలో విలీనం చేశారు. ఆయన ధైర్యసాహసాలకు మెచ్చి జాతిపిత మహాత్మాగాంధీయే ఆయనను సర్దార్(సేనాపతి) అన్న పిలుపుతో ఆలింగనం చేసుకున్నారు.

## నాన్న నేర్పిన నిజాయతీ

అవి స్వాతంత్ర్యం సిద్ధించిన మొదటిరోజులు. పంచాయితీ బోర్డు ఎన్నికల్లో జైనులబ్దీన్ రామేశ్వరం పంచాయితీ ప్రెసిడెంటుగా ఎన్నికయ్యారు. కులమతాల ఆధారంగా కాక కేవలం ఉత్తమ ఆశయాలున్న ఆదర్శవంతమైన వ్యక్తిగా ప్రజల చేత ఆయన ఎన్నికయ్యారు. అదే రోజు సాయంత్రం ఆయన కుమారుడు కిరసనాయిలు దీపం వెలుగులో ఇంట్లో చదువుకుంటున్నాడు. ఎవరో అపరిచిత వ్యక్తి తలుపు తీసుకుని లోపలికి వచ్చాడు. "ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నాన్నగారికి శుభాకాంక్షలు చెబుదామని వచ్చాను. నాన్న ఎక్కడ" అని ప్రశ్నించాడు. నాన్న ఇంట్లోలేడనీ, అమ్మ ప్రార్థనలో ఉందనీ పిల్లవాడు అతడికి చెప్పాడు. వచ్చిన తరువాత నాన్న గారికి ఇవ్వమని చెప్పి ఆ వ్యక్తి చక్కగా అలంకరించిన బహుమతిని ఆ బాలుడి చేతిలో ఉంచాడు. మళ్ళీ కలుస్తానని వెళుతున్న ఆ వ్యక్తికి వీడ్కోలు చెప్పి పిల్లవాడు బహుమతిని మంచం మీద ఉంచి చదువుకోవటంలో మునిగిపోయాడు. తండ్రి రాగానే మంచం మీద ఉంచిన బహుమతిని చూసి "ఏమిటిది? ఎవరిచ్చారు?" అని అడిగాడు. ఎవరో ఒక పెద్ద మనిషి ఇచ్చి వెళ్ళాడంటూ పిల్లవాడు బదులిచ్చాడు. తండ్రి పెట్టెను తెరచి చూశాడు. అందులో ఒక ఖరీదైన పంచె, శాలువా, పళ్ళు, ఒక చీటీ, తీపి పదార్థాలున్నాయి. ఆయన పట్టరాని కోపంతో కొడుకును కొట్టడం ప్రారంభించాడు. ఆ అరుపులు విని తల్లి లోపలినుండి వచ్చి పిల్లవాణ్ణి కొట్టవద్దని వేడుకుంది. శాంతించిన తండ్రి "భగవంతుడు మనకొక పదివిచ్చాడంటే, మన అవసరాలన్నీ ఆయనే సమకూరుస్తాడు. అంత కన్నా ఎక్కువ ఆశిస్తే అది అన్యాయమౌతుంది" అని వివరించాడు. కొడుకును దగ్గరకి తీసుకొని "ఎవరైనా మనకు ఏదైనా కానుక ఇస్తున్నారంటే దాని వెనక ఏదో ఉద్దేశం ఉండే ఉంటుంది. మన నుండి ఏదో ఆశిస్తున్నారన్నమాట. అందువల్ల కానుకలు పుచ్చుకోవడం తప్పు" అని చెప్పాడు. తండ్రి తనను కొట్టినందుకు పిల్లవాడు బాధపడలేదు. కోపం పెంచుకోలేదు అంతకుమించి ఎంతో విలువైన గుణపాఠం నేర్చుకున్నట్లు సంబరపడ్డాడు. ఆ చిన్నారే తదనంతరం భారత రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలామ్.






"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

భారతదేశ చరిత్రలో అదో మధురఘట్టం... 1947 ఆగష్టు 15న ఆంగ్లేయుల చెరనుంచి మన దేశానికి విముక్తి లభించింది. దేశప్రజలంతా పండుగ చేసుకునే పర్వదినమది! ఆసేతు హిమాచలం, భారతీయులంతా సంబరాల్లో మునిగిపోయారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వతంత్ర భారతావని ప్రథమ ప్రధానిగా ఎంపికయ్యారు. ఆగష్టు 14న అర్ధరాత్రి ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు; మనం స్వతంత్రులమయ్యామని ప్రకటించగానే భారతావనిలో ఇంటింటా కరతాళధ్వనులు మిన్నంటిపోయాయి. దేశప్రజల గుండెలు చలించిపోయాయి. ఎందరెందరో నాయకులు ఢిల్లీలోని ఎర్రకోట మైదానంలో



# మాననీయుడు... మహాత్ముడు

– జి. సతీష్

ఆసీనులయ్యారు. ఆ ఆనందాతిశయానికి సాక్షులుగా నిలిచారు. కానీ ఒకే ఒక్క మహనీయుడు, ఆ శుభఘడియలకు మూల కారకుడు అయిన సూత్రధారి మాత్రం, ఆ వేదికను అలంకరించ లేదు; ఆ సంబరాలవైపునకు రానేలేదు. కానీ సహజమైన తన దయార్ద్ర హృదయంతో మత కల్లోలాల్లో దెబ్బతిన్న కుటుంబాల దుఃఖార్తిని ఓదార్చడానికి పశ్చిమబెంగాల్‌లోని నౌఖాలీలో హిందూ ముస్లింల మధ్య అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పాదరక్షలు లేకుండా పర్యటించారు. స్వేచ్ఛాఫలాలను తన అనుయాయులకు ఇచ్చి, తను మాత్రం నిస్సంగుడై మరోవైపునకు పయనమయ్యారు. నాయకుడనే మాటకు నిజమైన నిర్వచనాన్నిచ్చారు. ఆయనే మహాత్మాగాంధీ! జాతిపితగా ఆయన ఎర్రకోట బురుజుల మీద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే మొదటివ్యక్తి తనే కావాలని కలలు కనవచ్చు; ప్రధాని పదవిని కూడా ఆశించవచ్చు. ఆయన అడిగితే ఎదురు ప్రశ్నించే సాహసం కూడా ఎవరూ చేయలేరు. కానీ మహాత్మాగాంధీ ఇవేమీ కోరుకోలేదు. కానీ ఆయన ఆ క్షణంలో కూడా ఒక సాధారణ వ్యక్తిలా సంబరాలకు సుదూరంగానే ఉన్నారు. ఆపన్నుల మధ్య గడిపారు. అదీ మన మహాత్ముడి వ్యక్తిత్వ ఔన్నత్యం. "నాయకుడైన వ్యక్తి నిస్వార్థంతో, కర్మయోగిగా మెలగాలి. అలా నీవు నిజంగా ఇతరుల మంచినే కోరితే, వారి కోసమే జీవిస్తూ ఉంటే; నీలో స్వార్థం లవలేశమైనా లేకపోతే, విశ్వమంతా ఏకమై ఎదిరించినా, నీలోని దైవశక్తి ముందు నిలవ లేక నశించిపోవలసిందే" అన్న స్వామి వివేకానంద ధీర వచనాలను అక్షరాలా ఆచరించి చూపారు మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ! అందుకే మహాత్ముడై చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. భగవద్గీతకు సజీవభాష్యంగా జీవితాన్ని తీర్చిదిద్దుకున్న మహాత్మాగాంధీ, అడుగడుగునా కర్మయోగాన్ని ఆచరించి చూపారు.

**ఆ మహనీయుడి పారదర్శకత...**

తన మౌనంతో మహామహా నాయకులనే ప్రభావితం చేసిన మహాత్మాగాంధీ పారదర్శకతలో కూడా మనకు ఆదర్శంగా నిలిచారు. నిజాయతీకి సంబంధించిన ఉదంతాలు గాంధీజీ ప్రస్థానంలో కోకొల్లలు. ఆయన ప్రతిరోజూ సాయంకాలం ప్రార్థనా సమావేశానికి హాజరవుతూ ఉండేవారు. ఆ సమావేశాల తరువాత హరిజనుల, తదితరుల సంక్షేమం కోసం కానుకలు, విరాళాలు సేకరించే కార్యక్రమం ఉండేది. గాంధీజీ అనుచరులు అన్ని వర్గాల ప్రజల నుంచీ విరాళాలు, కానుకలు సేకరిస్తూ ఉండే వారు. ఆ తరువాత ఆయన ఎంపిక చేసిన కొందరు సభ్యులు వాటిని లెక్కించేవారు. వారు రాత్రి భోజన సమయానికి ముందు మహాత్మాగాంధీకి ఆ లెక్క అప్పగించేవారు. ఆ మరునాడు బ్యాంకు ఉద్యోగి వచ్చి ఆ సొమ్ము డిపాజిట్ చేయడానికి తీసుకుపోయే వాడు. ఒకసారి ఆ బ్యాంకు ఉద్యోగి వచ్చేటప్పటికి అతనికి అప్పగించిన సొమ్ముకూ, ఆ ముందు రాత్రి గాంధీజీకి లెక్క అప్పగించిన దానికీ మధ్య కొన్ని పైసల తేడా వచ్చింది. ఆ విషయం విని మహాత్ముడు ఎంతో బాధపడ్డారు. ఆ రోజంతా ఆయన నిరాహారుడిగానే ఉండిపోయారు. అది బీదవాళ్ళ కోసం సేకరించిన విరాళమనీ, దానిలో ఒక్క పైస కూడా తేడా కలిగించే అధికారం మనకు లేదనీ పశ్చాత్తాపపడ్డారు. ప్రజాజీవితంలో పారదర్శకతకు ఇది అద్వితీయమైన ఉదాహరణ. ❖

(అక్టోబర్ 2న గాంధీ జయంతి)



"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org


Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

# శ్రేష్ఠ పాలకుడు

ప్రియదర్శిగా పేరుగాంచిన అశోక సామ్రాట్టు జన్మదినోత్సవం జరుగుతోంది. ఆ సందర్భంగా ఆయన 'మీలో ఉత్తమోత్తముడైన ప్రజానాయకుడికి మంచి బహుమానం ఉంటుంది' అని ప్రకటించాడు. సామంతులందరూ బహుమతి కోసం పోటీపడ్డారు.

ముందుగా దక్షిణ ప్రాంతాధికారి ఇలా చెప్పాడు: 'ఈసారి నా కోశాగారంలో గత సంవత్సరం కంటే ఆదాయం మూడు రెట్లు పెరిగింది'.



ఉత్తరప్రాంత సామంతరాజు ఇలా చెప్పాడు: 'గత ఏడాది కంటే నేను నా పాలనా ప్రాంతంలో బంగారాన్ని మూడు రెట్లు పెంచాను'.

తూర్పు ప్రాంతాధికారి సమాధానమిలా వచ్చింది: 'మా ప్రాంతంలో తీవ్రవాదులనందరినీ అణచివేసాను. ఇక అక్కడ ఎవరికీ కన్నెత్తి చూసే ధైర్యం కూడా లేదు.'

పశ్చిమ ప్రాంతపు శాసకుడు గర్వంగా ఇలా చెప్పాడు: 'నేను నా సేవకులందరి వేతనాల్ని తగ్గించి వేసాను. ప్రజల మీద పడే పన్నుల సంఖ్యను పెంచాను. దీంతో మా ప్రాంత ఆదాయం బాగా పెరిగింది'.

ఇలాగే మిగిలిన ప్రాంత సామంతులు కూడా తమ తమ గొప్పలు చెప్పుకున్నారు. చివరగా మగధ సామంతరాజు వంతు వచ్చింది. ఆ రాజు వినయంగా సామ్రాట్టుతో ఇలా అన్నాడు: 'మహారాజా! నన్ను క్షమించండి. ఈ ఏడు నా ప్రాంతంలో గతేడాది వచ్చిన ఆదాయంలో సగం ఆదాయమే వచ్చింది'.

'ఎందుకలా?' అని అశోకుడు ప్రశ్నించాడు. 'ఈ ఏడాది రాజ సేవకులందరికి కొత్తగా కొన్ని సౌకర్యాలు కల్పించాను. అందువలన వాళ్ళు మరింత శ్రద్ధగా, నిజాయతీగా శ్రమపడతారు. సాధారణ పౌరులకు పన్నులలో కొన్ని వెసులుబాట్లు కలిగించాను. ఏడాది చివరికి వారి కోసం మరిన్ని ధర్మసత్రాలు, వైద్యశాలలు, పాఠశాలలు ప్రారంభించాలనే ఆలోచన కూడా ఉంది' అన్నాడు మగధ రాజు.

అశోక సామ్రాట్టు ఎంతో ఆదరంగా అతడి దగ్గరకు వెళ్ళి ఇలా అభినందించాడు: "నాకు కావాల్సింది ప్రజల రక్తంతో బంగారపు రాశులు ప్రోది చేసేవారు కాదు, ప్రజల సుఖ సౌఖ్యాల విషయం లోతుగా ఆలోచించే ప్రజాపాలకులే! కాబట్టి ఈ ఏడాది సర్వశ్రేష్ఠుడైన ప్రజా నాయకుడివి నువ్వే!" ❖

# ఏది విలువైన రాయి?

ఒకసారి మహారాణా రణజీత్‌సింహ దర్బారులోకి ఒక మహాత్ముడు వచ్చాడు. మహారాణా ఆయనకి సకలోపచారాలు చేసి తన ధనాగారంలోకి తీసుకుని వెళ్ళాడు. అక్కడెన్నో విలువైన రత్నాలు, వజ్రాలు, ముత్యాలు ఉన్నాయి.

'ఈ రాళ్ళ వలన మీకెంత ఆదాయం వస్తుంది?' అని అడిగాడు మహాత్ముడు. 'వీటి వలన ఆదాయం ఏమిటి? వీటిని రక్షించడానికి నాకెంతో డబ్బు ఖర్చు అవుతూ ఉంటుంది' అన్నాడు మహారాణా.

'మరి ఇవి విలువైనవి ఎలా అవుతాయి. నా దగ్గర వీటన్నింటికీ మించిన విలువైన రాయి ఉంది' అన్నాడు మహాత్ముడు. 'అయితే అది నాకు తప్పక చూపవలసినదే' అన్నాడు మహారాణా. మహాత్ముడు ఓ గ్రామంలో ఉన్న ఒక కుటీరం లోపలికి తీసుకువెళ్ళాడు. అక్కడ ఒక ముసలమ్మ తిరగలి రాయితో పిండి విసురుతోంది.

'మహారాజా! ఇదీ విలువైన రాయి అంటే. మీదగ్గరున్న రాళ్ళన్నీ అలా పడి ఉన్నాయి. ఈ రాయి మాత్రం ప్రతిరోజూ చకచకా తిరుగుతూ పిండి విసురుతోంది. ఆ పిండిని అమ్ముకొని ఈ ముసలామె బతుకుతోంది. కాబట్టి మీ ధనాగారంలో పడి ఉన్న రాళ్ళన్నిటి కంటే ముసలమ్మకు బతుకుతెరువు చూపిస్తున్న ఈ రాయే ఎంతో విలువైనది' అన్నాడు మహాత్ముడు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల (రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)



"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.


www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

## భగవద్గీత - సద్గుణ సుధ

- స్వామి పరిజ్ఞేయానంద



# పురోగమన సూత్రం!

సాధారణంగా పిల్లల ప్రవర్తన సరిగా లేకపోతే తల్లితండ్రులు దండిస్తారు; విద్యార్థులు క్రమశిక్షణతో మెలగకపోతే ఉపాధ్యాయులు మందలిస్తారు; ఉద్యోగుల పనిలో నైపుణ్యం కొరవడితే ఉన్నతాధికారులు నిందిస్తారు... ఇలా ఎవరైనా సరే తాము వ్యవహరించవలసిన రీతిలో వ్యవహరించకపోయినా, చేయాల్సిన రీతిలో పనిని చేయకపోయినా వారిపట్ల అసహనాన్ని ప్రదర్శించడమో, కోపగించుకోవడమో, నిందించడమో, పరుషంగా మాట్లాడడమో చేస్తూవుంటాం. ఇలాంటి చర్యల వల్ల ఎదుటి వ్యక్తిలో మార్పుని తీసుకురాలేం. ఒకవేళ మార్పు వచ్చినా అది తాత్కాలికమే!

నిజానికి, ఎదుటివారిని భయపెట్టడం వలన వారిలో ఆత్మస్థైర్యం సన్నగిల్లుతుంది; పరుషంగా మాట్లాడడం వలన వారిలో మొండితనం పెరుగుతుంది; లోపాలను ఏకరువు పెట్టడం వలన ఆత్మన్యూనతాభావం అధికమవుతుంది; అవమానపరచడం వలన ఆత్మాభిమానం దెబ్బతింటుంది; నిందించడం వలన నిరాశ చోటుచేసుకుంటుంది.

మరి, ఒక వ్యక్తి కర్తవ్యనిర్వహణలో విముఖత చూపించినప్పుడు; అనూహ్యరీతిలో ప్రవర్తించినప్పుడు; మరలా వారి కర్తవ్యాన్ని గుర్తుచేసి సవ్యమార్గంలో నడిపించడమెలా? నిర్వీర్యులైన వారిలో శక్తి సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని నింపడమెలా? నిరాశకు గురైన వారిని గమ్యంవైపు సాగేలా ప్రోత్సహించడమెలా? ఈ ప్రశ్నలకు శ్రీకృష్ణుడు, యుద్ధభూమిలో అర్జునుడితో వ్యవహరించిన తీరే సమాధానం.

కురుక్షేత్రంలో అందరూ యుద్ధానికి సిద్ధమైన సమయంలో అర్జునుడు 'నేను యుద్ధం చేయను, నా గొంతు ఎండిపోతుంది, నా శరీరం వణుకుతుంది, నా చేతిలో నుండి గాండీవం జారిపోతుంది' అంటూ అస్త్రాలను విసర్జించాడు. అత్యంత క్లిష్టసమయంలో అర్జునుడు అధైర్యాన్ని చూసినవారెవరైనా సహనం కోల్పోయి అర్జునుడి చపలత్వానికి చీవాట్లు పెట్టేవారు, పిరికితనాన్ని చూసి మందలించేవారు, బాధ్యతా రాహిత్యానికి ఆగ్రహించి యుద్ధభూమి నుండి వెళ్ళిపోయేవారు. కానీ శ్రీకృష్ణుడు అలా వ్యవహరించలేదు. దుఃఖితుడైన అర్జునుడితో...

**కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।**
**అనార్యజుష్టమస్వర్గ్యం అకీర్తికరమర్జున ॥** *(గీత. 2-2)*

'అర్జునా! ఇలాంటి క్లిష్టసమయంలో ఆర్యులకు తగనిదీ, స్వర్గగతికి ప్రతిబంధకమైనదీ, అపకీర్తిదాయకమైనదీ అయిన ఈ మోహం నిన్ను ఎలా ఆవరించింది?' అని ప్రశ్నించాడు.

సాధారణంగా, ఎవరైనా అర్జునుడిలా అసంబద్ధంగా ప్రవర్తిస్తే నీవు పిరికివాడివనీ, బుద్ధిహీనుడవనీ, పనికిరానివాడవనీ మందలిస్తారు. కానీ శ్రీకృష్ణుడు అర్జునుడితో 'అర్జునా! అనార్యజుష్టమ్ - ఆర్యులకు తగనిపని. అంటే నీవు ఆర్యుడవు (బుద్ధిమంతుడవు) కానీ అనార్యుడవు (బుద్ధిహీనుడవు) కావు' అని అతణ్ణి మెచ్చుకున్నాడు. అందువల్ల అర్జునుడిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆ తరువాత శ్రీకృష్ణుడు "ఇప్పుడు నువ్వు భయపడి, కర్తవ్యాన్ని విస్మరించడం వల్ల అస్వర్గ్యమ్ - ఉన్నత గతిని కోల్పోతావు, అకీర్తికరమ్ - అపకీర్తిపాలవుతావు" అని అర్జునుడి ప్రవర్తన వల్ల కలిగే పరిణామాల తీవ్రతను విశదపరిచాడు.

'నువ్వు బుద్ధిమంతుడవు, నీకు అపకీర్తి కలిగే పనులు చేయకు' అన్న శ్రీకృష్ణుని రెండు మాటల వల్ల నిరాసక్తుడైన అర్జునుడిలో ఆత్మస్థైర్యం పెరిగింది, సానుకూల దృక్పథం ఏర్పడింది. ఆ తరువాత యుద్ధభూమిలో అర్జునుడు ప్రదర్శించిన ధైర్యసాహసాల గురించి మనకు తెలిసిందే!

అందువల్ల పిల్లలనైనా, పెద్దలనైనా, తప్పుచేసిన వారినెవరినైనా... నిందించకూడదు, వారి లోపాలను ఎత్తిచూపకూడదు. శ్రీకృష్ణుడు, అర్జునుడిలోని సుగుణాలను మెచ్చుకున్నట్లు ముందుగా వారితో 'నువ్వు మంచివాడవు, తెలివైనవాడవు, ఇది నీలాంటి వాడు చేయదగిన పని కాదు' అని చెప్పి వారిలో సానుకూల దృక్పథాన్ని కల్పించాలి. అప్పుడు ఎలాంటివారిలోనైనా మార్పు వచ్చితీరుతుంది.

అందుకే స్వామి వివేకానంద "తప్పులను ఎత్తిచూపకూడదు. సానుకూలభావాలను అందిస్తే ఎలాంటివారైనా ఉన్నతంగా ఎదుగుతారు"అని అంటారు. కాబట్టి శ్రీకృష్ణుడు నిరాశతో నిండిన అర్జునుణ్ణి ప్రోత్సహించి కార్యోన్ముఖుణ్ణి చేసినట్లు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు... ఇలా మానవ ప్రతిభను జాగృతం చేయాలనుకున్న ఎవరైనా ఎదుటి వ్యక్తిని సానుకూల భావాలతో ప్రోత్సహించి, వారి పురోగమనానికి తోడ్పడాలి. ❖



"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

# సాధనతో సత్ఫలం

– స్వామి అద్భుతానంద*

శ్రీకృష్ణుడు, ఉద్ధవుడితో ఇలాగన్నాడు: 'ముందుగా తపస్సాధనలు చేయి. అప్పుడే నేనెవరో, నా మహిమ ఏమిటో నీకు అర్థం కాగలదు. ఇప్పుడే తెలిపాననుకో, నీవు అర్థం చేసుకోలేవు. కనుక, ముందు సాధన చేయి'.

శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానందల గురించి గొప్పలు చెబితే ఏమి లాభం? వారి బోధలు చదివినంత మాత్రాన ఏమి లాభం? వారు ఉభయులు చెప్పినవి అనుష్ఠింపకపోతే శ్రద్ధాభక్తులు ఎలా అలవడుతాయి? ఒక పక్కన అసత్యం పలుకుతారు, మోసాలు చేస్తారు, ఇంకా ఎన్నో అన్యాయాలు సలుపుతారు. మరొక ప్రక్క 'శ్రీరామకృష్ణ, శ్రీరామకృష్ణ' అంటూ గొప్ప భక్తులుగా చలామణి అయ్యే ప్రయత్నం చేస్తారు. వంచన ద్వారా ధనం, పేరు ప్రతిష్ఠలు సంపాదించవచ్చు కానీ ఆధ్యాత్మికంగా ఎదగజాలం.



స్వామి అద్భుతానంద

సరళ భావంతో నామస్మరణ చేయాలి. పెద్ద పెద్ద వ్యాఖ్యానాలు చేస్తూ జనాన్ని మోసపుచ్చి పేరుప్రతిష్ఠలు సంపాదించవచ్చు కానీ భగవంతునికి నీ మనస్సులోని భావాలన్నీ తెలుసు. భగవత్సాక్షాత్కారం కోరుకునేవారు పేరు ప్రతిష్ఠలకై ప్రాకులాడకూడదు. వాటిని చూసి మురిసిపోకూడదు. ఏకాంతంలో సాధన చేయాలి. భగవత్సాక్షాత్కారానంతరం, ఆయన ఆదేశం లభిస్తే భావ ప్రచారం చేయాలి. ప్రచారానికి వలసిన శక్తి ఆయనే ప్రసాదిస్తాడు. ముందు ఆదేశాలను శిరసావహించండి, అప్పుడు ఆదేశాలివ్వగల శక్తి వస్తుంది.

శ్రీరామకృష్ణులు గృహస్థులకు, సన్న్యాసులకు కూడా ఆదర్శప్రాయులు. అన్ని మత మార్గానుయాయులకు ఆయనే ఆదర్శం. సకల మార్గాల ద్వారా సాధన చేసి భగవత్సాక్షాత్కారం పొందారు. అంతేగాని చిలుక పలుకులు పలకలేదు. ఆయన జగద్గురువు. ఆయనను ఆదర్శంగా పెట్టుకొన్న వారికి సంసారబాధలు ఉండవు. నామాట నమ్మండి.

నేను విద్యావంతుణ్ణి, ధనికుణ్ణి... ఇటువంటి ధోరణి ఉంటే అహంకారం ఉబ్బిపోతుంది. నాకన్నా గొప్పవారున్నారని, నేను సాధించినదెల్ల దైవ కృప అని తలుస్తే అహంకారం పోతుంది. లేశమాత్రం అహంకారం లేని వ్యక్తి ఎన్ని ఘనకార్యాలైనా చేయగలడు. పోతే లోకహితం చేయడానికి కొంచెం అహంకారం అవసరం, అది హానికరం కాదు. 'నేను యంత్రాన్ని, ఆయన యంత్రచాలకుడు' అనే భావం ఉండాలి; అది స్థిరం కావడానికి సాధు సాంగత్యం అవసరం.

ఒకనాడు భవనాథ్‌ను, స్వామీజీని వంట చేయమన్నారు శ్రీరామకృష్ణులు. అందరం భోజనాలకు కూర్చొనే సమయానికి ఒక దాసరి వచ్చాడు. గురుదేవులు ఆయనను పంక్తిలోకి అనుమతించలేదు. 'ఇన్ని వంటకాలు చేసాం. ఆ దాసరికి పెడితే, లోటా? గురుదేవులు వట్టి పిసినారి' అని తలచాం. అప్పుడు గురుదేవులు 'అతడు ఎటువంటి పనులు చేశాడో మీకు తెలుసా? మీ పంక్తిలో కూర్చొని తినే అర్హత పొందేటంతటి సుకృతాలు చేశాడా అతడు?' అన్నారు. సహవాసదోషం అంటే ఏమిటో, అప్పుడు మాకు అర్థమైంది. సాధకులు ఎవరంటే వారితో సాంగత్యం చేసినా, సంభాషించినా, కలిసి తిన్నా సాధన దెబ్బతింటుంది. గురుదేవులు ఈ విషయంలో చాలా కచ్చితంగా ఉండేవారు, మమ్మల్ని హెచ్చరించేవారు.

నిరంతరం సత్సాంగత్యం చేస్తే మనస్సు శుద్ధమగును. సద్గ్రంథ పఠనం కూడా సత్సాంగత్యంతో సమానం. సరైన బుద్ధి లేని వారికి సత్సాంగత్యం, సద్గ్రంథ పఠనం వృథా. పోతే సత్సాంగత్యం ఎన్నడో ఒకనాడు ఫలితం చూపుతుంది. బ్రహ్మచర్యం, ఆత్మసంయమనం లేనివారికి సద్బుద్ధి కలగదు, గ్రహణ శక్తి ఉండదు.

అహోరాత్రుళ్ళూ సంసార తాపత్రయంలో మునిగి ఉండి, మనసులో దురాలోచనలు చేస్తూ ఉంటారు. ఇటువంటి మనసులో భక్తిశ్రద్ధలు ఎలా జనిస్తాయి? శాస్త్రవచనాల పట్ల శ్రద్ధ కలగడానికి సాధుసజ్జనుల సాంగత్యమే మార్గం. సాధువుల ఉపదేశాలను పాటించే ప్రయత్నం చేయండి. క్రమక్రమంగా మనస్సు శుద్ధమై సంశయాలు తొలగిపోతాయి. ❖

(*భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు)



"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా డిజిటల్ రూపంలో అందించబడుతుంది. సేవలో భాగంగా ఈ చిత్రాన్ని శ్రీ రామకృష్ణ ప్రభ నుంచి సేకరించి అందిస్తున్నాము, ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాము. ఇటువంటి వ్యాసాలు మీరు వ్రాసినట్లయితే లేక సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

www.freegurukul.org

Website: www.freegurukul.org Mobile App: FreeGurukul HelpLine: 9042020123 email: support@freegurukul.org

★★ Note: we use this image for Free Education, Non-Profit purpose only ★★

# విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య

- ★ సభ్యత, సంస్కారం, విలువలు, ధర్మాలు ఉచితంగా నేర్పబడును
- ★ బడిలో చెప్పని పాఠాలు, క్రమశిక్షణ నేర్పబడును
- ★ ఇంట్లో నేర్పని జీవిత నైపుణ్యాలు చెప్పబడును
- ★ సామాజిక బాధ్యత, సామాజిక అవగాహన కల్పించబడును

✷ 3500 తెలుగు పుస్తకాలు ✷ ప్రతి రోజు వార్తాపత్రికలలో వచ్చే ప్రేరణాత్మక వ్యాసాలు ✷ 740 IMPACT వ్యక్తిత్వ వికాస వీడియోలు

✷ 3800 సామాజిక అవగాహన చిత్రాలు/వీడియోలు ✷ 748 ప్రవచనాలు ✷ 2000 వ్యక్తిత్వ వికాస ఆర్టికల్స్/వ్యాసాలు

గమనిక: తల్లిదండ్రులకి/విద్యార్థులకు/ఉపాధ్యాయులకి/ప్రిన్సిపాల్ కి ప్రత్యేక ఆహ్వానం. విలువలతో కూడిన దేశ నిర్మాణం జరగాలంటే అది మీ ద్వారానే.


ఉచిత గురుకుల విద్య
( విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య డిజిటల్ రూపంలో)
www.freegurukul.org
ఉచిత గురుకుల విద్య
సామాజిక అవగాహన (Social Awareness)
All: 3811 Views: 3856
ఇంపాక్ట్ - వ్యక్తిత్వ వికాసం ( IMPACT-Personality Development)
All: 741 Views: 9382
ఉచిత తెలుగు పుస్తకాలు (Free Telugu Books)
Books: 3444 Read: 365064
వీడియో ప్రవచనాలు (Video Pravachanams)
Pravachanams: 748 Views: 61846
ఆడియో ప్రవచనాలు (Audio Pravachanams)
Pravachanams: 720 Plays: 50658
మైండ్ మేనేజ్‌మెంట్ (Mind Management)
Images: 1999 Views: 45666
పిల్లలు (Children)
All: 1597 Views: 45948
www.freegurukul.org
Home
New
Top
Submit
Search
Category
By Author
By Publisher
Recent Read
Search
Google play
FREE GURUKUL
ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ - Free Gurukul Education Foundation
www.freegurukul.org
Helpline: 9042020123

# FreeGurukul WhatsApp Broadcast Subscribe

ఈ రోజున బడిలో, ఇంట్లో కూడా చెప్పని సభ్యత, సంస్కారం, విలువలు, ధర్మాలు, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత, సామాజిక అవగాహన(డ్రైవింగ్, స్మోకింగ్, చెట్లు, రక్తదానం..) వంటి విషయాలపై FreeGurukul ద్వారా అవగాహన కల్పిస్తున్నాము.

1) అవగాహనకు సంబందించిన అవసరమైన, ముఖ్యమైన, ఉపయోగపడే సమాచారం WhatsApp ద్వారా పంపబడును.

2) Good Morning/Evening, whatsapp, facebook లో హల్ చల్ చేసేవి మేము పంపము అని హామీ ఇస్తున్నాము.

3) రోజుకి ఒకటి లేక రెండు మెసేజ్ లు మాత్రమే పంపబడును.

◆ మీకు FreeGurukul నుంచి సమాచారం ఇష్టం లేదు/వద్దు అనిపిస్తే మీరు నిరభ్యంతరంగా STOP లేక NO అని పంపించుకొనే సదుపాయం.

◆ మీకు FreeGurukul నుంచి సమాచారం కావాలి అంటే

1) ఈ 9042020123 ని contacts లో తప్పనిసరిగా SAVE చేసుకోగలరు, లేకపోతే Broadcast నియమాల ప్రకారం Message పొందలేరు

2) అలాగే ఈ 9042020123 కి START లేక YES అని Whatsapp ద్వారా అంగీకారం తెలియచేయగలరు